హైదరాబాద్ వార్త



# ఇక ట్రాఫిక్ కష్టాలకు చెల్లు!

## -కొండాపూర్ ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి -ఐటీ కారిడార్‌లో తీరనున్న ట్రాఫిక్ కష్టాలు



**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త**

నగరవాసులకు ఐటీ కారిడార్‌లో ప్రయాణించే వారికి ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి కొండాపూర్‌కు వెళ్లే అత్యాధునిక మల్టీ లెవెల్ ఫ్లైఓవర్ నిర్మాణం దాదాపు పూర్తయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జూన్ మొదటివారంలో వంతెన ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇది అందుబాటులోకి వస్తే గచ్చిబౌలి జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గడంతో పాటు ప్రయాణ సమయం కూడా ఆదాకానుంది. ఫ్లైఓవర్‌ను రూ. 178 కోట్ల వ్యయంతో స్ట్రాటజిక్ రోడ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా నిర్మించారు. 1.2 కిలోమీటర్ల పొడవు, 24 మీటర్ల వెడల్పుతో ఆరులేన్లతో అందుబాటులోకి రానుంది. ఇది ఇప్పటికే ఉన్న రెండు ఫ్లై ఓవర్లపై నిర్మించిన మూడో స్థాయి నిర్మాణం. కింద గచ్చిబౌలి జంక్షన్ ఫ్లై ఓవర్, దానిపై శిల్పా లేఅవుట్ ఫేజ్ 1 ఫ్లై ఓవర్ ఉండగా, ఇప్పుడు దానికి పైన ఫేజ్ 2 ఫ్లై ఓవర్ నిర్మించారు. దీంతో గచ్చిబౌలి జంక్షన్ వద్ద తీవ్రమైన ట్రాఫిక్ సమస్యను ఈ ఫ్లై ఓవర్ చాలా వరకు తగ్గిస్తుంది. ఓఆర్ఆర్ నుంచి కొండాపూర్, హఫీజ్‌పేట్‌మార్గాల్లో వెళ్లే వాహనాలకు ఇది చాలా అనుకూలంగా ఉంటుంది. హైటెక్ సిటీ, ఫైనాన్షియల్ డిస్ట్రిక్కు మెరుగైన కనెక్టివిటీ లభిస్తుంది. ప్రయాణ సమయం ఆదాతో పాటు గంటల తరబడి ట్రాఫిక్ లో చిక్కుకోకుండా వేగంగా గమ్య స్థానాలకు చేరుకోవచ్చు. కొండాపూర్ ప్రాంతం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్, అక్కడి నుంచి కొండాపూర్ ప్రాంతాలకు వెళ్ళేందుకు గచ్చిబౌలి వద్ద ఎలాంటి ట్రాఫిక్ జామ్ లేకుండా నేరుగా వెళ్లే వెసులుబాటు కలదు. జీహెచ్ఎంసీ అధికారులు ఈ ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేశారు. గతంలో కొన్ని కారణాల వల్ల ఆలస్యం అయినప్పటికీ, పనులు ప్రస్తుతం తుది దశలో ఉన్నాయి. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి. ఈ ఫ్లై ఓవర్ ప్రారంభం హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో ఒక ముఖ్యమైన అడుగు అవుతుంది.

**వేగంగా ఎస్ఆర్డీపీ పనులు..**

సీఆర్ఎంపీ, ఎస్ఆర్డీపీల ద్వారా చేపట్టిన పనులు పూర్తి కావడంతో గతంలో కంటే ఎక్కువ వేగంగా వెళ్లేందుకు స్పీడ్ పెంచినట్లు అధికారులు చెప్తున్నారు. ఎస్ఆర్డీపీ ద్వారా చేపట్టిన మొత్తం 42 పనుల్లో ఈ ఫ్లైఓవర్‌తో 37 పనులు పూర్తి అయ్యాయి. ఫలక్‌నుమా రైల్వే ఓవర్ బ్రిడ్జి, శాస్త్రిపురం ఆర్వోబీ పనులు రైల్వే పోర్షన్ రెండు మూడు నెలల్లో పూర్తి చేయాలని టార్గెట్ నిర్ణయించి కమిషనర్ ఆర్వీ కర్ణన్ రైల్వే అధికారులను కోరారు. వారికి జులై నెల చివరి వరకు ఫలక్‌నూమా ఆర్వోబీ, ఆగస్టు నెల చివరి వరకు శాస్త్రిపురం ఆర్వోబీ పనులను పూర్తి చేయాలని టార్గెట్ పెట్టారు. గతంలో జీహెచ్ఎంసీకి సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు నగర అభివృద్ధికి నిధులను మంజూరు చేసి జీహెచ్ఎంసీకి ఆర్థిక ఇబ్బందులు లేకుండా చేస్తున్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో నగర అభివృద్ధికి హెచ్ సిటీ ద్వారా రూ. 7032 కోట్ల వ్యయంతో 58 పనులు చేపట్టనున్నారు. అందులో 28 ఫ్లైఓవర్లు, 13 అండర్ పాస్‌లు, నాలుగు ఆర్వోబీలు, మూడు రైల్వే అండర్ బ్రిడ్జిలు, 10 రోడ్డు వెడల్పు పనులు చేపట్టేందుకు ప్రతిపాదించారు. ఈ పనులను టెండర్ దశ పూర్తి చేసి అగ్రిమెంట్ దశలో ఉన్నాయి. ఈ పనులను కొన్ని జూన్ మాసంలో ప్రారంభమయ్యే అవకాశం ఉంది.

# ఏప్రిల్ నాటికి సుంకిశాల ప్రాజెక్టును పూర్తి చేయాలి

## -ప్రాజెక్టు పనులను పరిశీలించిన జలమండలి ఎండి అశోక్ రెడ్డి

**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త :**

హైదారాబాద్‌కు కృష్ణాజలాల తరలింపుకోసం చేపట్టిన సుంకిశాల ఇంటెక్‌వెల్ పనులను ఏప్రిల్ నాటికి పూర్తి చేయాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డి ఏజెన్సీలకు సూచించారు. మంగళవారం మేఘా ఇంజనీరింగ్ సిఈఓ, డైరెక్టర్, హైద్రాబాద్ ఐఐటి ప్రొఫెసర్లు, టిసిఎస్, గేట్ల ఎక్స్ పర్ట్ కన్నయ్య నాయుడు, ఇతర నిపుణులతో కలిసి ఆయన సుంకిశాల ప్రాజెక్టు పనులను ఆయన పరిశీలించారు. జలమండలి ఎండి ఉన్నత అధికారులతో కలిసి పైపులైను విస్తరణ పనులను పరిశీలించారు. ఇప్పటి వరకు మిగిలిపోయిన పైపులైను పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పైపులైను నిర్మాణ నాణ్యతలో రాజీ పడకూడదని అధికారులకు ఆయన సూచించారు. వర్షాకాలం సమీపించిన తరుణంలో పైపు విస్తరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఎండి ఆదేశించారు. అనంతరం నిర్మాణ సంస్థ సిఈఓ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఇతర నిపుణులతో కలిసి సుంకిశాల పునర్నిర్మాణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను, రేడీజైనింగ్ సంబంధించిన వివరాలను నిపుణులతో చర్చించారు. అలాగే శిథిలాల తొలగింపు అనంతరం సివిల్‌వర్క్‌లు, కంట్రోల్ రూం పనులను వేగంగా ముగిస్తే సైడ్ వాల్ పునర్నిర్మాణానికి మార్గం సులభం అవుతుందని అంచనా వేశారు. అనంతరం నాగార్జున సాగర్ జలాశయం వైపు ఉన్న టన్నెలింగ్ ప్లగ్గింగ్ పనులను పరిశీలించారు. అలాగే ప్రతీ టన్నెలింగ్ వద్ద గేట్ల నిర్మాణం, డిజైన్లను సంబంధించిన వివరాలను నిపుణుడు కన్నయ్య నాయుడుతో చర్చించారు. ఈ సందర్భంగా ఎండి అశోక్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే పైపులైను విస్తరణ పనులు 4 కిలోమీటర్లు మినహా మిగతా ప్రాంతాలలో పూర్తి చేశామని, ఎలక్ట్రిక్ పనులు సైతం చివరిదశకి చేరుకున్నాయని అన్నారు. రిటైనింగ్ వాల్ శిథిలాలను తొలగింపు పూర్తిచేసి పునర్నిర్మాణం పనులు మొదలు పెట్టాలని, దానికి సంబంధించిన డిజైన్‌లు, డ్రాయింగ్‌లను 15 రోజుల లోగా ఫైనలైజ్ చేయాలని ఆదేశించారు. పునర్నిర్మాణ పనులు చేపట్టి ప్రాజెక్టును వచ్చే ఏప్రిల్ వరకు పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టివి శ్రీధర్, సిజిఎం మహేష్ కుమార్, హైదరాబాద్ ఐఐటి ప్రొఫెసర్లు శశిధర్, సురేంద్రనాథ్, గేట్ల రూపకర్త కన్నయ్య నాయుడు, టిసిఈ ప్రతినిధి నితీష్, ఇతర అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఫతేనగర్ వంతెన పరిశీలించిన హైడ్రా కమిషనర్

## -శిథిలావస్థకు చేరిన మెట్లు తొలగింపు



బ్రిడ్జికింద మెట్లమార్గాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్,మే 27,ప్రభాతవార్త:**

ఫతేనగర్ వంతెన మెట్లను హైడ్రా కమిషనర్ శ్రీ ఏవీ రంగనాథ్ గారు మంగళవారం ఉదయం పరిశీలించారు. శిథిలావస్థకు చేరుకున్న వంతెన మెట్లపై నుంచి దిగుతుండగా అవి విరిగిపడి ఇరువురిగి తీవ్ర గాయాలైన విషయం విధితమే. సోమవారం జరిగిన ఈ ఘటన నేపథ్యంలో కమిషనర్ మెట్ల మార్గాన్ని మంగళవారం పరిశీలించారు. ప్రతి ఆదివారం సనత్‌నగర్‌లో సంత జరుగుతుందని.. ఆ సమయంలో వందలాది మంది మెట్ల మార్గాన్ని వినియోగిస్తారని పలువురు కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. శిథిలావస్థకు చేరుకున్న మెట్లపై నుంచి రాకపోకలు సాగించడం సరికాదని కమిషనర్ నిర్ధారించారు. వంతెనకు ఆనుకుని ఏర్పాటు చేసిన మెట్లను పూర్తిగా తొలగించాలని హైడ్రా అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో శిథిలావస్థకు చేరిన నిర్మాణాల విషయంలో సివిల్ ఇంజినీరింగ్ విభాగం నిపుణులతో తనిఖీ చేయించి ప్రమాదకరంగా మారక ముందే వాటిని తొలగించాలని కమిషనర్ అధికారులకు సూచించారు. కమిషనర్ ఆదేశాలతో ఫతేనగర్ వంతెనకు ఆనుకుని నిర్మించిన మెట్ల మార్గాన్ని జేసీబీతో హైడ్రా డిజాస్టర్ సిబ్బంది మెట్లను తొలగించారు. కొత్తగా అక్కడ మెట్లు నిర్మించేందుకు ఏర్పాట్లు చేస్తామని ఫతేనగర్ కార్పొరేటర్ సతీష్‌గౌడ్ ఈ సందర్భంగా చెప్పారు.

# ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలు తక్షణమే అమలు చేయాలి



ధర్నాలో నినాదాలు చేస్తున్న ఆటో జేఏసీ నేతలు

**ధర్నాచౌక్, మే 27, ప్రభాతవార్త:** 2023 ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో డ్రైవర్లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను తక్షణమే అమలుచేయాలని ఆటోజేఏసీ రాష్ట్ర అధ్యక్షులు మంద రవికుమార్ డిమాండ్ చేశారు. ఆటో రథయాత్ర ముగింపు సందర్భంగా మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఏర్పాటుచేసిన ఆటో ఆకలి కేకలు మహాసభ నుద్దేసించి ఆయన మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం వల్ల నష్టపోయి, ఆత్మహత్యలు చేసుకున్న ప్రతి ఆటో డ్రైవర్ కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం 25లక్షల నష్టపరిహారం చెల్లించాలని, కుటుంబాంలో ఒకరికి ఉపాధి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. మహాలక్ష్మి పథకానికి ప్రత్యామ్నాయంగా ఆటో డ్రైవర్లకు ఇస్తానన్న 12వేలను సంవత్సరానికి కాకుండ నెల నెలకు ప్రభుత్వం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో కార్పోరేషన్ను ఏర్పాటుచేసి, వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని, ఇన్సూరెన్స్ ఎనిమిది వేల నుండి ఎనిమిది వేల నుండి వెయ్యి రూపాయలకు తగ్గించాలని, ఓలా, ఊబర్, ర్యాపిడ్ ల పేరుతో అక్రమంగా నడుస్తున్న వాహనాలను వెంటనే నిషేధించాలని కోరారు. బీపీటీఎంఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండి హబీబ్ మాట్లాడుతూ 50 సంవత్సరాల వయస్సు పెరిగిన ఆటో డ్రైవర్లకు పది వేల రూపాయల గౌరవ పెన్షన్ ఇవ్వాలని, గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటో మీటర్ల రేట్లు పెంచాలని, ఆటోకు స్టేట్ పర్మిట్ ఇవ్వాలని, ఇండ్లు లేని ఆటో డ్రైవర్లకు స్థలాలు కేటాయించాలని, 7.5 లక్షల మంది ఉన్న ఆటో కార్మిక రంగాన్ని అతి పెద్ద పరిశ్రమగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆటో డ్రైవర్ల న్యాయమైన సమస్యలు పరిష్కరించి, న్యాయం చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమంలో బీఆర్‌టియూ ఆటో యూనియన్ అధ్యక్షులు వేముల మారయ్య, బీఎంఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి రవి శంకర్ అల్లూరి, ఏఐటియూసీ ఆటో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకటేశ్వర్లు మద్దతు తెలుపగా వివిధ జిల్లాల నుండి వచ్చిన ఆటో డ్రైవర్లు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# నగరంలో దంచికొట్టిన వర్షం



**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త**

హైదరాబాద్‌లో మంగళవారం రాత్రి ఒక్కసారిగా భారీ వర్షం కురిసింది. దంచికొట్టిన వర్షంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. కొండాపూర్, మియాపూర్, లింగంపల్లి, జూబ్లీహిల్స్, మాదాపూర్, హైటెక్‌సిటీ, గచ్చిబౌలి, యూసుఫ్‌గూడ, మల్కాజ్‌గిరి, నేరెడ్‌మెట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఒక్కసారిగా వర్షం కురిసింది. కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, నిజాంపేట, బాచిపల్లిలో వర్షం పడింది. అల్వాల్, శామీర్‌పేట, జవహర్ నగర్, దమ్మాయిగూడ, ఒక్కసారిగా కురిసిన ఈదురుగాలులతో కూడిన వర్షానికి వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. రోడ్లపై నీరు నిలిచిపోయింది. పలుచోట్ల ట్రాఫిక్ స్తంభించింది. సాయంత్రంలో ఉద్యోగస్తుల ఇళ్లకు చేరే సమయం కావడంతో పలుచోట్ల వానతో ట్రాఫిక్ జామ్ అయింది. ఇదిలా ఉండగా.. రాబోయే మూడుగంటల్లో హైదరాబాద్‌లో భారీ వర్షం కురిసేందుకు అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. భారీ వర్షాన్ని దృష్టిలో పెట్టుకొని అవసరం ఉంటేనే బయటకు రావాలని అధికారులు సూచించారు. గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ప్రజలు చెట్లకింద, శిథిలావస్థలో ఉన్న భవనాల దగ్గర ఉండరాదని హెచ్చరించింది.

# ఫేక్ సర్టిఫికేట్లకు చెక్!

-బర్త్, డెత్ సర్టిఫికేట్లు కొరకు "సివిలియన్ రిజిస్ట్రేషన్ సిస్టమ్"
-యూనిక్ ఐడీ నెంబర్‌తో సర్టిఫికేట్ల జారీకి చర్యలు
-దేశంలో ఎక్కడి నుంచైనా తీసుకునేలా ఏర్పాట్లు
-నూతన విధానం అమలు చేసేందుకు జిహెచ్ఎంసి కసరత్తు




**హైదరాబాద్,మే 27,ప్రభాతవార్త:**

జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, (బర్త్,డెత్ ) సర్టిఫికెట్ల జారీ కోసం జిహెచ్ఎంసి సరికొత్త విధానం అమలు చేయనుంది. ఇందుకు అధికారులకు కసరత్తు చేస్తున్నారు. జీహెచ్ఎంసీలో ఇప్పటివరకు ఉన్న బర్త్, డెత్ సర్టిఫికెట్ల జారీ నియమావళిలోని లొసుగులను ఆసరాగా చేసుకుని కొందరు అధికారులు, సిబ్బంది, మధ్యవర్తులు అడ్డదారిలో బర్త్, డెత్ సర్టిఫికేట్లు జారీ చేస్తున్నట్లు సమాచారం. దీంతో అలాంటి వాటికి చెక్ పెట్టేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తున్నారు. అందుకు కొత్తగా సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (సిఆర్ఎస్),అమలు చేసి యూనిక్ ఐడీ నెంబర్ తో ఈ సర్టిఫికెట్ జారీ చేయనున్నట్లు తెలుస్తుంది. దీంతో జీహెచ్ఎంసీ పరిధిలో జనన, మరణాలు సంభవిస్తే దేశంలో ఎక్కడి నుంచైనా సర్టిఫికెట్లు తీసుకునే వెసులు బాటు కలుగుతుందని అధికారులు తెలుపుతున్నారు. ఇందుకు సంబంధించి ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగే జనన, మరణాలకు సంబంధించిన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకునే దరఖాస్తుదారుడి ఆధార్ కార్డు, అందులో ఫోన్ నెంబర్ ఉంటేనే దరఖాస్తు స్వీకరించేలా ఈకొత్తవిధానం అమలు చేయనున్నారు. దీంతో దరఖాస్తును స్వీకరించిన వెంటనే ఆధార్ కార్డులోని ఫోన్ నెంబర్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ఫోన్ నెంబర్ వెరిఫికేషన్ జరుగుతుందని ఆతర్వాత తదుపరి ఆమోదం కోసం బర్త్, డెత్ రిజిస్ట్రార్‌కు దరఖాస్తు వెళ్తుందని అధికారులు తెలిపారు. కొద్దిరోజుల క్రితం చనిపోయిన ఓ వ్యక్తికి సంబంధించి అతనితో సంబంధం లేని వ్యక్తి అతని పేరిట ఫేక్ డెత్ సర్టిఫికెట్ తీసుకుని..చనిపోయిన వ్యక్తి ఆస్తులను విక్రయించుకున్న ఘటన వెలుగు చూసింది. దీంతో ఈవ్యవహారాన్ని గమనించిన ఆయన కుమార్తె ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారులకు చెప్పింది. అయితే అప్పటివరకు సదరు వ్యక్తి తీసుకున్న సర్టిఫికెట్ ఫేక్ అన్న విషయం అధికారులకు తెలియదు. చనిపోయిన వ్యక్తికి కూతురు తప్పా, వేరే వారసులు లేకపోవటంతో నిందితుడు ఈ రకమైన మోసానికి పాల్పడినట్లు తెలుస్తుంది. ఈ ఘటనపై విచారణ చేపట్టి, సదరు సర్టిఫికెట్ ను రద్దు చేయటంతో పాటు సర్టిఫికేట్ తీసుకున్న వ్యక్తిపై క్రిమినల్ కేసు కూడా నమోదు చేయించిన జీహెచ్ఎంసీ అధికారులు సర్టిఫికెట్లు పక్కాగా, పారదర్శకంగా జారీ చేసే సరి కొత్త విధానం కోసం అన్వేషించి, సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ ను అనుసరించేందుకు సిద్ధమైనట్లు సమాచారం.

వాస్తవానికి గత సంవత్సరం చివర్లో హైదరాబాద్ నగరంలో హోమ్ బర్త్ ప్రాతిపాదికన ఏకంగా 70 బర్త్ సర్టిఫికెట్లను జారీ చేయటంతో అనుమానం వచ్చిన అప్పటి కమిషనర్ ఇలంబర్తి ఈ సర్టిఫికెట్ల జారీపై విజిలెన్స్ ఎంక్వైరీకి ఆదేశించారు. దీంతో అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. మూతపడి ఉన్న టోలీచౌకీలోని మెట్రో హాస్పిటల్ ఒక్కటే తప్పుడు సమాచారంతో 65 బర్త్, మరో ఎనిమిది డెత్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు అధికారులు గుర్తించారు. దీంతో సదరు హాస్పిటల్ రిజిస్ట్రేషన్ రద్దు చేయించటంతో పాటు నిర్వాహకులపై క్రిమినల్ కేసులు కూడా పెట్టారు. అలాగే ఫలక్‌నుమాలో మూడు, మలక్ పేటలో మరో ఒక బర్త్ సర్టిఫికెట్‌లను అడ్డదారిలో జారీ చేసినట్లు కూడా గుర్తించారు. ఈ అక్రమాలను బల్దియా సీరియస్‌గా తీసుకుంది. దీంతో దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాల స్థానిక సంస్థలు బర్త్, డెత్ సర్టిఫికెట్లను కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోని సివిలియన్ రిజిస్ట్రేషన్ సిస్టమ్(సీఆర్ఎస్) పరిధిలోకి బర్త్, డెత్ సర్టిఫికెట్లను తీసుకురావాలని అప్పట్లోనే కమిషనర్ ఇలంబర్తి ప్రతిపాదించగా, కొత్తగా వచ్చిన కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అందుకు ఆమోదం తెలిపినట్లు తెలుస్తుంది.

# జూన్ 6న ఖైరతాబాద్ మహాగణపతి కర్ర పూజ



**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త**

ఖైరతాబాద్ మహా గణపతి నవరాత్రోత్సవాలు అంటేనే స్పెషల్. అత్యంత ఎత్తైన, విశిష్ట లంబోదరుడు అక్కడ ప్రతి ఏటా కొలువుదీరుతాడు. అయితే, ఆ మహాగణపతి ప్రతిష్టించేందుకు మూడు నెలల ముందే పనులు మొదలు పెడతారు. ఈ నేపథ్యంలోనే 2025 సంవత్సరానికి గాను గణేష్ తయారీ పనులు జూన్ 6న నిర్జల ఏకాదశి రోజు కర్ర పూజతో ప్రారంభం కానున్నాయి. ఖైరతాబాద్‌లో వరుసగా 71 సంవత్సరం మహా గణపతిని ప్రతిష్టించబోతున్నట్లుగా ఖైరతాబాద్ గణేష్ ఉత్సవ కమిటీ, శ్రీగణేష్ ఉత్సవ కమిటీ ఖైరతాబాద్ సభ్యులు తెలిపారు. ఖైరతాబాద్‌లో మహా గణపతిని 1954లో తొలిసారిగా ప్రతిష్టించారు. అయితే, ఈ సంవత్సరం గణేషుడు ఎన్ని అడుగులు దర్శనమిస్తాడోనని నగరవాసులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 27న వినాయక చవితి ఉండటంతో జూన్ 6న సాయంత్రం 5గంటలకు కర్ర పూజ నిర్వహించి పనులను ప్రారంభించనున్నారు.

# బడికి బాట దొరికింది

## -స్కూల్ దారికి అడ్డుగా ఉన్న గోడను తొలగించిన హైడ్రా
## -చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సంఘటన



**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:**

సికింద్రాబాద్‌లోని మెట్టుగూడ డివిజన్ చిలకలగూడ దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బాట దొరికింది. సోమవారం జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయం ఎదుట ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్ రెడ్డి గౌరవనీయ సీఎం గారు.. మా బడికి బాట వేయించండి అంటూ ప్ల కార్డు పట్టుకుని ధర్నాకు దిగిన వార్త మీడియాలో ప్రసారం అవ్వడంతో హైడ్రా రంగంలోకి దిగింది. హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో ఇన్‌స్పెక్టర్ ఆదిత్య క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఆ పాఠశాలకు వెళ్లే మార్గంలో అక్కడి నివాసితులు అడ్డంగా నిర్మించిన ప్రహరీని తొలగించారు. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్‌తో పాటు సిబ్బంది కూడా ఉండి అడ్డు గోడ తొలగింపు పనులను పర్యవేక్షించారు. ప్రహరీ తొలగించిన చోట వెంటనే గేటు ఏర్పాటు చేస్తామని జోనల్ కమిషనర్ రవి కిరణ్ చెప్పారు.

**విద్యార్థుల భవిష్యత్తు బాగుండాలనే..**

చిలకలగూడ దూద్ బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు దారి లేకపోవడంతో గత కొంతకాలంగా విద్యార్థులు పడుతున్న బాధను చూసే సమస్య పరిష్కారానికి ఎలాగైనా ముందడుగు వేయాలన్న సంకల్పంతోనే శాంతియుత దీక్ష నిర్ణయాన్ని తీసుకోవడం జరిగిందని మల్లికార్జున్ రెడ్డి తెలిపారు. సదరు సమస్య పరిష్కారం కోరుతూ గతంలో జిహెచ్ఎంసి ఉన్నతాధికారులకు, పాలకులకు పలుమార్లు వినతి పత్రాలను సమర్పించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. అయినా కూడా వారి నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో విద్యార్థుల అవస్థలను దృష్టిలో పెట్టుకొని సమస్యను పరిష్కరించడం కోసం తాను ముందడుగు వేసి దీక్షను చేపట్టినట్లు ఆయన తెలిపారు.

# గోవా టూ హైదరాబాద్ కొకైన్..

## -నిందితుడు అరెస్టు, డ్రగ్స్ స్వాధీనం




**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త**

వ్యాపారంలో మంచి లాభాలను అర్జిస్తు ఉంటాడు. తరుచు గోవాకు వెళ్లి వస్తు ఉండడంతో డ్రగ్స్‌కు అలవాటు పడ్డాడు. ఈ డ్రగ్స్ అలవాటును తనతోపాటు తన స్నేహితులకు అలవాటు చేశాడు. చేస్తున్న వ్యాపారానికి మరింత లాభాలు అర్జించడానికి గోవా టూ హైదారాబాద్‌కు డ్రగ్స్, ఓజీ కుష్ తీసుక వచ్చి హైదరాబాద్‌లో తన స్నేహితులకు అమ్మకాలు జరుపుతూ తాను వినియోగిస్తున్న కరణ్ పర్మామర్ అనే వ్యక్తి మంగళవారం రంగారెడ్డి ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌కు పట్టుబడ్డాడు. పట్టుబడిన నిందితుడి వద్ద రూ.3లక్షల విలువ చేసే 19.36 గ్రాముల కోకైన్, రూ.35 వేల విలువ చేసే 6.7 గ్రాముల ఓజీ కుష్‌లను ఏఈఎస్ జీన్ కిరణ్ టీమ్ పట్టుకున్నారని అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ తెలిపారు. పట్టుబడిన నిందితుడు కరణ్ కర్మామర్‌తోపాటు సంతోష్‌పై కేసు నమోదు చేశారు. నిందితుడిని, పట్టుకున్న కోకైన్, ఓజీ కుష్‌ను బాలనర్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు. కోకైన్ పట్టుకున్న కేసులో ఏఈఎస్ జీవన్ కిరణ్‌తోపాటు సీఐలు బాలరాజ్, సుబాష్ చందార్‌రావుతోపాటు ఎస్సైలు రవి చల్లా, వెంకటేశ్వర్లు, అఖిల్ సిబ్బంది ఉన్నారు.

# ప్రేమ పేరుతో మోసం చేసి విదేశాలకు వెళ్లిన వ్యక్తి అరెస్టు

**సంజీవరెడ్డి నగర్,మే 27 ప్రభాతవార్త:**

ప్రేమ పేరుతో యువతిని పెళ్లి చేసుకుంటానని మోసగించి విదేశాలకు పారిపోయిన యువకుడిని ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్. ఆర్.నగర్ పోలీసులకు వచ్చిన ఫిర్యాదు మేరకు అమీర్‌పేటకు చెందిన యువతిని బెంగుళూర్‌లోని కామన్ ఫ్రెండ్స్ మీటింగ్‌లో కలిసి తొలి చూపులోనే పెళ్లి చేసుకుంటానని మాట ఇచ్చి యువతిని విశాంక్ అనే యువకుడు శారీరకంగా లోబర్చుకున్నాడు. ఉన్నత చదువుల కోసం యూకే వెళ్లి వచ్చాక పెళ్లి చేసుకుంటానని, తనను కూడా విదేశాలకు తీసుకెళ్లానని శశాంక్ యువతిని నమ్మించి మోసం చేశాడు. తీరా విదేశాలకు వెళ్లిన తరువాత శశాంక్ దూరంపెట్టడం చేశాడు. యువతికి సంబంధించిన సోషల్ మీడియా అకౌంట్లను బ్లాక్ చేయడంతో ఆమె మోసపోయానని గ్రహించి బాధిత యువతి పోలీసులను ఆశ్రయించి 2023 డిసెంబర్‌లో ఫిరా ్యదు చేసెసింది. యువతి ఫిర్యాదు మేరకు విదేశాలకు వెళ్లిన శశాంక్‌పై ఎస్. ఆర్.నగర్ పోలీసులు లూక్‌ఔట్ నోటీసులు జారీ చేశారు. యూకే నుంచి శశాంక్ శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు వస్తున్నాడని ఇమిగ్రేషన్ అధికారులు ఎస్.ఆర్.నగర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎయిర్‌పోర్ట్‌లో శశాంక్‌కు అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.

## జెన్‌కో సిఎండీని కలిసిన విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్లు



సిఎండీకి సన్మానిస్తున్న ప్రధాన కార్యదర్శి అంజయ్య, నాజర్ షరీఫ్, పరమేష్, స్వామి తదితరులు

**హైదరాబాద్, మే 27,ప్రభాతవార్త:**
తెలంగాణ జెన్‌కో సిఎండీగా నియమితులైన ఐఏఎస్ అధికారి ఎస్.హరీష్‌ను విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ మర్యాదపూర్వకంగా కలిసింది. ఈమేరకు మంగళవారం సంఘం ప్రధాన కార్యదర్శి పి.అంజయ్య ఆధ్వర్యంలోని ప్రతినిధిబృందం సిఎండీనిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించింది. ఈసందర్భంగా జెన్‌కోలోని అకౌంట్స్ ఆఫీసర్ల సమస్యలను వివరించారు. సిఎండీని కలిసిన వారిలో ఉపాధ్యక్షులు నాజర్ షరీఫ్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీలు వి.పరమేష్, స్వామి, రాష్ట్ర ఫైనాన్స్ సెక్రటరీలు పి.అనిల్, కొరడాల వెంకటేశ్వర్లు, మధుసూధన్, రామారావు, రాజశేఖర్, అపర్ణ తదితరులు ఉన్నారు.

## ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి: కార్పొరేటర్ జితేందర్‌నాథ్



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్

**అల్వాల్, మే 27 ప్రభాతవార్త:**
అభివృద్ధిని ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకుని వెళుతున్నామని మచ్చబొల్లారం కార్పొరేటర్ జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని శివం భావి, సత్యం ఎన్‌క్లేవ్ లులో 26లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. ప్రజావసరాలు మేరకు కనీస వసతులు కల్పించడం జరుగుతుందని జితేందర్‌నాథ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నేతలు సురేందర్ రెడ్డి, శ్రీశైలం, వెంకటేష్, సర్వేశ్ యాదవ్, కొండల్ రెడ్డి, స్వామి ఇతరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభించిన కార్పొరేటర్



అభివృద్ధి పనులు ప్రారంభోత్సవంలో కార్పొరేటర్

**అల్వాల్, మే 27 ప్రభాతవార్త:** ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి కొనసాగుతుందని వెంకటాపురం కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్ తెలిపారు. మంగళవారం డివిజన్ పరిధిలోని వెంకటాపురంలో 14లక్షలు వ్యయంతో ఏర్పాటు చేయనున్న సిసి రోడ్డు పనులను కార్పొరేటర్ ప్రారంభించారు. నాణ్యత పట్ల అధికారులు జాగ్రత్తలు వహించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు అనీల్ కిషోర్, ప్రకాష్ గౌడ్, రాజశేఖర్, మోసిన్, మురళి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**నేత్రపర్వంగా నటరత్న ఎన్.టి.ఆర్ 103వ జయంతి మహోత్సవం**
**రవీంద్రభారతి, మే 27 ప్రభాతవార్త :** విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, పరిపాలనాదక్షుడు, రాజనీతిజ్ఞుడు నటరత్న నందమూరి తారక రామారావు 103వ జయంతి మహోత్సవము రవీంద్రభారతి ప్రధాన మందిరంలో నేత్రపర్వంగా నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి అధ్యక్షుడు, జవహర్ బాలభవన్ పూర్వ సంచాలకుడు డా. ఎం.కె.రాము తెలిపారు. శుక్రవారం 30 రాత్రి 6.30లకు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి సభాధ్యక్షతన జరిగే ఈ మహోత్సవానికి ముఖ్యఅతిథిగా విచ్చేయనున్న తమిళనాడు రాష్ట్ర పూర్వ గవర్నరు పి.ఎస్.రామ్మోహన్‌రావు విశిష్ట అతిథి పద్మశ్రీ డా. కొలకలూరి ఇనాక్, ఆత్మీయ అతిథులు జస్టిస్ బి.చంద్రకుమార్, డా. సముద్రాల వేణుగోపాలాచారి, ఎం.నరసింహప్ప, ఎం.కె.రాము, ఎం.కె.ఆర్.ఆశాలత తదితరులతో కలిసి ప్రముఖ సంస్థ తెలుగువన్ వ్యవస్థాపకుడు, ఎండి కంఠంనేని రవిశంకర్‌ను ఘనంగా సత్కరించి ఎన్‌టిఆర్ పురస్కారం ప్రదానం చేస్తారని రాము వివరించారు. సభకుముందు సాంస్కృతిక కార్యక్రమంలో డా. ఎం.కె.రాము రచన; రేణుకా ప్రభాకర్, వై.సుమలత నృత్యదర్శకత్వంలో రూపొందిన నందమూరి నవోదయం సంగీత నృత్యోత్సవ ప్రదర్శన ఉంటుందని, ఎన్టీఆర్ అభిమానులు, ఔత్సాహిక ప్రేక్షకులు అధికసంఖ్యలో విచ్చేసి ఎన్టీఆర్ 103వ జయంతి మహోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్‌కు డాక్టర్ లక్ష్మణ్ నేతృత్వం విశేషం



రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను సత్కరిస్తున్న అడిక్‌మెట్ బిజెపి అధ్యక్షుడు సాయికృష్ణయాదవ్

**చిక్కడపల్లి, మే 27 ప్రభాతవార్త:** ఫిజీ దేశంలో జరిగిన కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ యూకే, ఫిజీ రిపబ్లిక్ పార్లమెంట్ నిర్వహిస్తున్న ప్రతిష్టాత్మక ఆసియా పసిఫిక్ ప్రాంతీయ కార్యశాలలో భారతదేశ ప్రతినిధిగా, ఆస్ట్రేలియా దేశంలో సిడ్నీలో జరిగిన ఎన్ఆర్ఐ సమావేశంలో ప్రసంగించి నగరానికి తిరిగి వచ్చిన రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె. లక్ష్మణ్‌ను అడిక్‌మెట్ డివిజన్ బిజెపి అధ్యక్షుడు పి.సాయికృష్ణ యాదవ్, బిజెపి సీనియర్ నేత శేషసాయితో కలిసి మంగళవారం కలిసి సత్కరించారు. ఫిజీ దీవుల్లోని నాడిలో జరిగే ఈ కార్యశాలలో డా. లక్ష్మణ్ భారత్‌కు నేతృత్వం వహించడం అభినందనీయమన్నారు. . ఆసియా పసిఫిక్ ప్రాంత దేశాల్లో పబ్లిక్ ఫైనాన్స్ ను సునిశితంగా అంశాలపై ఈ కార్యశాలలో చర్చించడం, పబ్లిక్ ఫైనాన్స్ లో మరింత జ తీసుకువచ్చి పీఏసీలను బలోపేతం చేయాలనేది ఈ కార్యశాల లక్ష్యమన్నారు.

## విశ్వనాథ్‌ను అభినందించిన సెయింట్ పీటర్స్‌హై స్కూల్ యాజమాన్యం

**కంటోన్మెంట్,మే 27 ప్రభాతవార్త:** బోయిన్‌పల్లి సెయింట్ పీటర్స్ హై స్కూల్‌లో చదివిన పూర్వ విద్యార్థి విశ్వానాథ్ పట్టు దలతో దృష్టి సారించి ఎవరెస్ట్ ప్రపంచ శిఖరాల దాఖా పయణం సాగించినందుకు అ విద్యార్థి మనో ధైర్యాన్ని పాఠశాల కరస్పాండెంట్ టీ.ఏ.రెడ్డి అభినందించారు.

# కాకా బీఆర్ అంబేద్కర్ డిగ్రీ కాలేజీకి న్యాక్ అటానమస్ గుర్తింపు

## -గుర్తింపు రావడం శుభపరిణామం
## -ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి



ప్రసంగిస్తున్న విద్యాసంస్థల చైర్మన్, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, చిత్రంలో బెల్లంపల్లి ఎంపి గడ్డం వంశీ, ఎమ్మెల్యే జి.వినోద్‌కుమార్, కరస్పాండెంట్ సరోజా వివేక్ తదితరులున్నారు.

**చిక్కడపల్లి, మే 27 ప్రభాతవార్త:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ డిగ్రీ కాలేజీకి 'న్యాక్ ఆటనామస్ గుర్తింపు రావడం శుభపరిణామం అని చెన్నూరు ఎమ్మెల్యే, ఆ విద్యాసంస్థల చైర్మన్ వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం బాగ్ లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేకర్ డిగ్రీ కాలేజీ ఆవరణలో జరిగిన సంబురాల కార్యక్రమంలో బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్, ఎంపీ గడ్డం వంశీ, విద్యాసంస్థల కరస్పాండెంట్ సరరోజా వివేక్, వైష్ణవితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ అటనామస్ గుర్తింపు వచ్చినందుకు సంతోషంగా ఉందన్నారు. ఉత్తమ విద్యాబోధన, అధునాతన సౌకర్యాలతో అంబేద్కర్ కాలేజీలో విద్యాబోధన అందించడంతో పాటు ఫ్యాకల్టీ మెంబర్స్ సహకారం, కృషి చేయడం ఫలితంగా గుర్తింపు వచ్చిందన్నారు. పేదలకు నాణ్యతప్రమాణాలతో విద్యను అందించాలనే సంకల్పంతో మాజీ కేంద్ర మంత్రి జి. వెంకటస్వామి విద్యాసంస్థలను స్థాపించారన్నారు. కాకా కళ రోజు రోజుకి నెరవేరుస్తున్నామని, ఆటోనోమోస్ స్టేటస్ ద్వారా మరింత ఎక్కువ మందికి విద్యను అందించే అవకాశం ఉంటుందన్నారు. ఉన్నత ప్రమాణాలతో విద్యను అందించడానికి ఉత్తమ సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. ఇటీవల విడుదలైన ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షల్లో తమ కళాశాలకు ఉత్తమ ర్యాంక్ వచ్చాయని, ఇందులో టాప్ ర్యాంక్స్ రావడంలో ఫ్యాకల్టీ పాత్ర మరువలేమని,క్వాలిటీ ఎడ్యుకేషన్ అందించడం మేనేజ్మెంట్ బాధ్యత అని అన్నారు. న్యాక్, అటనామస్ గుర్తింపు రావడం శుభపరిణామం అని అన్నారు. కాకా వెంకటస్వామి ఈ విద్యాసంస్థలకు యూనివర్సిటీ గుర్తింపు రావాలని మాజీ మంత్రి జి.వినోద్ అన్నారు. అంబేద్కర్ కాలేజీలో చదివిన ప్రతి విద్యార్థి గొప్పగా ఫీల్ అవ్వాలని, ఫ్యాకల్టీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అంచడంపై దృష్టి పెట్టాలని, అందరు కలిసి పని చేయాలి అని అన్నారు. విద్యాసంస్థల సీఈవో ప్రొఫెసర్ లింబాద్రి మాట్లాడుతూ కాకా కళాశాలకు స్వయంప్రతిపత్తి స్టేటస్ రావడం వెనకాల విద్యసంస్థల కరస్పాండెంట్ సరోజా వివేక్ కృషి ఎంతో ఉందన్నారు. ఈ సందర్భంగా కళాశాలకు న్యాక్ గుర్తింపు రావడం పట్ల కళాశాల ప్రాంగణంలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి రమణకుమార్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ మట్ట, వివిధ కళాశాలల ప్రిన్సిపాల్, అధ్యపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి : సీతారాం ధూళిపాళ



మణికొండ అల్కాపూర్ కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న బిఆర్ఎస్ నేతలు

**నార్సింగి, మే 27 ప్రభాతవార్త :** మణికొండ మున్సిపల్ అధికారులురా... ప్రజల ముక్కు పిండి ఆస్థి పన్నులు వసూలు చేయడంపైనే కాదు ప్రజల సమస్యల పరిష్కారంపై కూడా దృష్టి పెట్టాలని బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ పేర్కొన్నారు. మంగళవారం బిఆర్ఎస్ నాయకుల బృందం మణికొండ మున్సిపల్ అల్కాపూర్ టౌన్‌షిప్‌లోని రోడ్డు నెంబర్ 19.లో గుడ్‌మార్నింగ్ మణికొండలో భాగంగా తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీతారాం ధూళిపాళ మాట్లాడుతూ మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరు కొండను తవ్వి ఎలుకను పట్టినట్లుందని పేర్కొన్నారు. మణికొండలో వందల సంఖ్యలో అక్రమ నిర్మాణాలున్నాయని, చిత్తశుద్ధి ఉంటే అన్నింటిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. కేవలం ఒకటి,రెండు భవనాలకు రంధ్రాలు పెట్టి తాము బాధ్యతగా పని చేస్తున్నామని ప్రకటించుకోవడం మానుకోవాలన్నారు. వర్షాలు మొదలవుతున్నా ఇంకా నాలాల్లో పూడికలు తీయలేదని, రోడ్లపై ఉన్న గోతులకు మరమ్మత్తులు చేపట్టలేదని, ఖాళీ స్థలాల్లో చెత్తను తొలగించలేదన్నారు. వీధి దీపాలన్నీ వెలిగేలా చర్యలు తీసుకోవాలని, వర్షాలు కురిసి వరదులు వస్తే ప్రజలు చీకట్లో ప్రమాదాలపాలవకుండా ఉంటుందన్నారు. వర్షపు నీరు సాఫీగా వెళ్లేందుకు డ్రైనేజీ కాలువల్లోని చెత్తను ఎత్తివేయాలన్నారు. ఆస్థి పన్నులు పెంచడంపై పెడుతున్న శ్రద్ధ ప్రజల సమస్యల పరిష్కారంపై పెట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కుంభగల్ల ధన్‌రాజ్, గుట్టమీది నరేందర్, బొమ్మ ఉపేంద్రనాథ్‌రెడ్డి, సంఘం శ్రీకాంత్, భానుచందర్, సుమ నళిని, బొద్దు శ్రీధర్, రాజేంద్రప్రసాద్, చెరుకూరి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులపై మేయర్ సమీక్షా సమావేశం

## -హాజరైన కార్పొరేటర్లు, అధికారులు



మేయర్ కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ అరుణసురేందర్‌యాదవ్,కార్పొరేటర్లు

**ఎల్బీనగర్, మే 27 ప్రభాతవార్త:** నియోజకవర్గ పరిధిలో వేగవంతంగా అభివృద్ధి పనులు జరుగుతున్నా నగర మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. ఎల్బీనగర్ జోనల్ కార్యాలయంలో మంగళవారం జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో హయాత్‌నగర్, సరూర్‌నగర్, ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు తమ డివిజన్ పరిధిలో ఉన్న సమస్యలను మేయర్ దృష్టికి తీసుకువెళ్లారు. రోడు, నాళాలు, చెరువు, పార్కులు, సంక్షేమ సంఘం భవనాలు, విద్యుత్, మంచినీరు, డ్రైనేజీ తదితర సమస్యలకు సంబంధించి కార్పొరేటర్లు మేయర్ దృష్టికి తీసుకువెళ్లి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని వినతి పత్రాలను అందజేశారు. ఆయా సమస్యలను పరిశీలించి ప్రణాళిక బద్ధంగా పరిష్కరిస్తామని మేయర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రాధాధీరజ్‌రెడ్డి, ఆకుల శ్రీవాణి అంజన్ కుమార్, వంగ మధుసూదన్‌రెడ్డి, చింతల అరుణా సురేందర్‌యాదవ్, నాయికోటి పవన్‌కుమార్, కొప్పుల నరసింహారెడ్డి, లచ్చిరెడ్డి, రంగ నరసింహగుప్తా, ఉపకమీషనర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వీడియో గేమ్స్ ఆడొద్దని మందలించినందుకు కొడుకు ఆత్మహత్య..!

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:**
వీడియో గేమ్ ఆడొద్దు, టీవీ చూడొద్దని తల్లి మందలించడంతో ఓ బాలుడు మనస్థాపానికి గురై ఆవేశంలో ఆ బాలుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సైబరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం, కంబాలపల్లి వెంకటయ్య, సుజాతలు తమ కుటుంబంతో వినయ్‌నగర్‌లోని రాధారెసిడెన్సీ లో నివసి స్తున్నాడు. వెంకటయ్య వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబా న్ని పోషిస్తున్నారు. వీరి పెద్దకుమారుడు కంబాలపల్లి రిషి(16) ఇటీవల పదో తరగతి పరీక్షల్లో ఫెయిల్ అయ్యా డు. దీంతో తను మానసికంగా ఒత్తిడికి గురికావడంతో కుటుంబసభ్యులంతా ధైర్యం చెప్పారు. త్వరలో జరగబో యే సప్లిమెంటరీ ఎగ్జామ్స్ కోసం ప్రిపేర్ అయ్యేందుకు ట్యూషన్ కూడా పెట్టించారు. అయితే రిషి మొబైల్‌లో గేమ్స్ ఆడటం, టీవీ చూస్తుండటాన్ని తల్లి గమనించింది. దీంతో ఆమె చదువుపై దృష్టి పెట్టాలని మందలించింది. తల్లి మాటలతో రిషి మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం అపార్టుమెంట్ పైకి వెళ్లి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన మృతుని తమ్ముడు తల్లికి చెప్పడంతో ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. తల్లి ఫిర్యాదుమేరకు సైబరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## కుటుంబ కలహాలతో భర్తను హత్య చేసిన భార్య

**వనస్థలిపురం. మే.27.ప్రభాతవార్త :**
తరచు భార్యాభర్తల మధ్య గొడవల నేపథ్యంలో భర్తను భార్య హత్య చేసిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం నల్లగొండ జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలంలో తండాకు చెందిన సభావత్ కిషన్(40) వెలిగొండ గ్రామా నికి చెందిన శిరీష తో 2005 లో ప్రేమ వివాహం జరిగింది. గత కొంతకాలంగా నగరానికి వచ్చి వనస్థలిపురం హిల్స్ కాలనీలో నివాసముంటున్నారు.కిషన్ దినసరి కూలీ.శిరీష వస్త్ర దుకాణంలో పనుచేస్తుంది.కిషన్ తరచుగా మద్యం సేవించి భార్య తో గొడవపడే వాడు.ఈ నేపథ్యంలో గత కొంతకాలంగా భార్యతో దూరంగా ఉన్న కిషన్ ఇటీవలే భార్య శిరీష వద్దే ఉంటున్నాడు. ఇదిలావుండగా సోమవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణ లో శిరీష భర్త కిషన్ ను తలపట్టుకొని గోడకేసి కొట్టింది. అనంతరం చున్నీతో గొంతునులిమి హత్య చేసింది. కిషన్ మొదట భార్య కూతురు బిందు పిర్యాదు మేరకు శిరీష పై కేసునమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం ఉస్మానియా ఆసుపత్రి తరలించి, కేసు నమోదు చేసుకుని వనస్థలిపురం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## సూరారం కట్ట మైసమ్మ ఆలయంలో అవినీతి..



అవినీతిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్న ఆలయ కమిటీ సభ్యులు

**పేట్ బషీరాబాద్, మే 27, ప్రభాతవార్త**
సూరారం కట్టమైసమ్మ ఆలయంలో గత 6 నెలలు క్రితం ఎండోమెంట్ డిపార్ట్‌మెంట్ వారు స్వాధీనం చేసుకోవడం జరిగింది. అప్పట్లో ఈఓగా క్రిష్ణామాచార్యలను నియమించడం జరిగింది. తరువాత జరిగిన కట్ట మైసమ్మ జాతరలో అనేక అవినీతి ఆరోపణలు ఈఓ మీద వచ్చాయి. ఎండోమెంట్ వారు స్వాధీనం చేసుకోకముందు కొంత మంది పెత్తనం చేశారు. అట్టివవారు ఈఓ క్రిష్ణామాచార్యులు టెంపుల్‌కు వచ్చే ఆదాయం హుండీ సొమ్ము, డొనేషన్లు బ్యాంక్ ఎకౌంట్‌లో వేయకుండా దారి మళ్లిస్తున్నారు. కొబ్బరికాయల దుకాణం కూడా ఎండోమెంట్ వారు స్వాధీనం చేసుకున్నారు. అయితే ఈ దుకాణం ప్రైవేట్ వ్యాక్తులకు ఇప్పించి 5లక్షలు వసూలుచేసి అట్టి పైసలు ఎక్కడికి పోయాయో తెలీదు. గుడి ఆదాయం మొత్తం పక్కదారి పడుతుంది. భక్తులకు సరైన సౌకర్యాలు లేవు. వెంటనే ఎండోమెంట్ కమీషనర్ చర్యలు తీసుకొని విచారణ జరిపించి, అవినీతి అధికారిని తొలగించి, కొత్త అధికారిని నియమించాలని ఆలయ ధర్మకర్త మన్నె ముత్యాలు, భక్తులు కోరారు. ఈ కార్యక్రమంలో కె.రాఘవరెడ్డి, ఎం. గణేష్, పి.శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మీడియా అకాడమీ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు శిక్షణ తరగతులు

**జీడిమెట్ల, మే 27, ప్రభాతవార్త**
మేడ్చల్ జిల్లా జర్నలిస్టులకు తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం మేడ్చల్ జిల్లా శాఖ కోరింది. ఈ మేరకు మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్ రెడ్డికి సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డమీది బాలరాజు, కార్యదర్శి వెంకట్రాంరెడ్డిలు వినతి పత్రం అందజేశారు. జూన్ 9, 10 వ తేదీలలో శిక్షణ తరగతులు నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 50 మంది జర్నలిస్టులకు నాంపల్లిలోని మీడియా అకాడమీ భవనంలో శిక్షణా తరగతులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. రెండు రోజులపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు పలువురు ప్రొఫెసర్లతో, సీనియర్ జర్నలిస్టులతో తరగతులు జరుగుతాయని అన్నారు.

# ఒబిసిలు రాజకీయంగా మరింతగా అభివృద్ధి చెందాలి



ఓబిసి పొలిటికల్ అకాడమీ శిక్షణ తరగతుల ప్రారంభసమావేశంలో మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్‌యాదవ్, చిత్రంలో రాములు తదితరులు.

**హైదరాబాద్, మే 27 ,ప్రభాతవార్త**
ఓబీసీలను రాజకీయంగా అభివృద్ధిలోకి తీసుకురావడానికి రాజకీయ శిక్షణా తరగతులను నిర్వహిస్తున్నట్లు చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బర్కత్‌పురలోని హైందవి కళాశాల ప్రాంగణంలో ఓబిసి పొలిటికల్ అకాడమీ శిక్షణ తరగతులను మంగళవారం ఆయన ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా గడ్డం శ్రీనివాస్‌యాదవ్ హాజరై మాట్లాడుతూ త్వరలో జరగనున్న గ్రామపంచాయతీ, ఎంపీటీసీ, జెడ్‌పిటిసి, మున్సిపాలిటీ, జిహెచ్ఎంసి ఎన్నికల్లో ఓబీసీలు రాజకీయంగా అభివృద్ధిలోకి రావడానికి ఈ శిక్షణ తరగతులు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ప్రశాంత్ కిషోర్, ప్రొఫెసర్ నాగేశ్వర్‌రావు, సునీల్, అమిత్ పాండేలతో ప్రతి ఆదివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఓబీసీలు రాజకీయంగా వెనుకబడి ఉన్నారని, వారు మంచి నాయకుడిగా ఎదగడానికి ఈ శిక్షణా తరగతులు తరగతులు దోహదపడతాయని వెల్లడించారు. అదేవిధంగా 21 మందితో అడ్వైజర్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాలలో త్వరలో పర్యటించి శిక్షణ పొందే వారి వివరాలను సేకరించి, శిక్షణ తరగతులలో భాగస్వాములు చేస్తామని పేర్కొన్నారు. అందుకు తెలంగాణ వ్యాప్తంగా ఓబీసీలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఈ కార్యక్రమంలో మేకల రాములు యాదవ్, రామచందర్ యాదవ్, సాయన్న ముదిరాజ్, మహేష్ గౌడ్, సత్యనారాయణ, కుమార్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్‌తో పాటు అన్ని జిల్లాల ఓబీసీ నాయకులు పాల్గొన్నారు.

# జూ పార్కులో జవహర్ లాల్ నెహ్రూ విగ్రహానికి నివాళులు



జూ పార్కు వద్ద జరిగిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు కన్నయ్యలాల్,రాజేష్ కుమార్

**చార్మినార్,మే 27 ప్రభాతవార్త :** భారత దేశ ప్రథమ ప్రధాన మంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ 61వ వర్ధంతి కార్యక్రమం మంగళవారం నెహ్రూ జూలాజికల్ పార్కులో ఆవరణలో జరిగింది.సీనియర్ కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ముజాహిద్ హుస్సేనీ,జి,కన్నయ్యలాల్,బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్ కుమార్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు నెహ్రూ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.కాగా జూ పార్కు అధికారులు,సిబ్బంది పండిట్ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతిని మరిచి పోవటాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ నాయకులు జూపార్కుల డైరెక్టర్ డాక్టర్.సునీల్ఎస్.హీరామత్‌కు వినతి పత్రం అందజేశారు.పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన నెహ్రూ జూలాజికల్ పార్కులో జవహర్ లాల్ నెహ్రూ జయంతి,వర్ధంతిని నిర్వహించక పోవటం చాలా బాధాకరమని,ఇలాంటి సంఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుండ చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు జూపార్కు డైరెక్టర్‌కు అంద జేసిన వినతి పత్రంలో పేర్కొన్నారు.ఈ విషయమై సానుకూలంగా స్పందించిన జూ పార్కుల డైరెక్టర్ సునీల్ ఎస్.హీరామత్ తక్షణమే ఆదేశాలు ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఆదేశించారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సయ్యద్ ఇక్బాల్, జబ్బార్,మీర్ మహ్మద్ అలీ షాన్,నజీర్ ఖాన్,నసీర్,బారి ఖాన్,యువజన కాంగ్రెస్ నాయకులు జ్యోతి శెట్టి,శ్రీ కాంత్, రామకృష్ణ, కాంగ్రెస్ నాయకులు గులాం నబీ,మఖ్బూల్, అశ్వక్,అహ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

**లాల్ దర్వాజ చౌరస్తాలో పండిట్ జవహర్‌లాల్ వర్ధంతి**
పాతబస్తీ లాల్ దర్వాజ చౌరస్తా వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ ఇంఛార్జి కె.వెంకటేష్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు నెహ్రూ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.పండిట్ జవహర్ లాల్ నెహ్రూ ఆశయాల కోసం ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని వెంకటేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో పాతబస్తీ కాంగ్రెస్ పార్టీ నాయకులు కె.సురేష్ బాబు, జి.శ్రీనివాస్,కిషన్ ప్రసాద్,కపూర్ పాల్గొన్నారు.

## సందేశాత్మకం రసరంజని ఎడారిలో వానచినుకు నాటకం : కెవి.రమణాచారి

**రవీంద్రభారతి, మే 27 ప్రభాతవార్త :** కన్న తల్లిదండ్రులపై ప్రేమానురాగాలు చూపించాల్సిందిపోయి కర్కోటంగా వారిని వృద్ధాశ్రమంలో వదిలేయడమే కాకుండా మంచి మనస్సు, దయార్థ హృదయంతో వారిని తల్లిదండ్రులుగా దత్తత తీసుకోవాలని ముందుకొచ్చిన మానవత్వం మూర్తీభవించిన వ్యక్తివద్ద వారిని లక్షల్లో బేరం పెట్టడం, అందుకు ఆగ్రహించిన తల్లిదండ్రులు తీసుకున్న నిర్ణయమే ఈ నాటకమని తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి, రసరంజని అధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి అన్నారు. ప్రతీనెలా నాటకం-ప్రేక్షకుడికి వినోదం... నటుడికి ఆనందం-అదే మాబాట మాటనే నినాదంతో నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్న ప్రముఖ సాంస్కృతిక రసరంజని హైదరాబాద్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి ప్రధాన మందిరంలో 29 గురువారం రాత్రి సాయి కార్తికేయ క్రియేషన్స్ కాకినాడ వారి సమర్పణలో ముఖ్యపాత్రల్లో రఘు, గణేష్, ఎం.సత్తిబాబు, సత్యనారాయణ, ఎన్.అప్పారావు, ఎ.సుబ్బారావు, డి. రాధాకృష్ణ, జ్యోతిరాణి, దుర్గాప్రసాద్‌లు అద్భుత నటనలో శరదా ప్రసన్న రచన; సిహెచ్.మహేష్ దర్శకత్వంలో రూపొందిన ఎడారిలో వానచినుకు నాటకం ప్రదర్శింపబడుతుందని, అధికసంఖ్యలో రంగస్థల నాటక ప్రేమికులు, ఔత్సాహిక ప్రేక్షకులు విచ్చేసి నాటకాన్ని ఆసాంతం తిలకించి రంగస్థలం, కళాకారులను ప్రోత్సహించాలని డా. కె.వి.రమణాచారి కోరారు.

## యోగ చైతన్య యాత్ర సందర్భంగా ఆత్మీయ సభ



కార్యక్రమంలో పాల్గొన్న పతంజలి శ్రీనివాస్, మేజర్ శ్రీనివాస్ తదితరులు

**చిక్కడపల్లి, మే 27 ప్రభాతవార్త:** ప్రణవ సంకల్ప యోగ సమితి వ్యవస్థాపకులు పతంజలి శ్రీనివాస్ గురూజీ శిక్షణ నేతృత్వంలో మహా సూర్య వందనం పేరుతో 22 వేలమంది గిరిజన విద్యార్థిని విద్యార్థులతో 108 పర్యాయాలు సూర్య నమస్కారములు 108 నిమిషములలో చేయించి ప్రపంచ రికార్డు సృష్టించారు. ఈ సందర్భంగా పిఎస్‌వైఎస్ సభ్యురాలు డి. మీనాక్షి దేవి ఉభయ తెలుగు రాష్ట్రాల నుండి అరకు ప్రపంచ రికార్డు కార్యక్రమంలో పాల్గొన్న యోగ శిక్షకులు సాధకులకు ప్రపంచ రికార్డు ప్రశంస పత్రాలు అందుకున్న సందర్భంగా మంగళవారం యోగ చైతన్య యాత్రలో భాగంగా ఉస్మానియా యూనివర్సిటీ పిజిఆర్ఆర్‌సిడిఈ ప్లాటినం జూబ్లీ ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఇండియన్ యోగ అసోసియేషన్ కోఆర్డినేటర్ పతంజలి శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా మాజీ సైనిక అధికారి, అంతర్జాతీయ రక్షణ విషయ నిపుణులు, మేజర్ శ్రీనివాస్, ఏపి, తెలంగాణ హైకోర్టు సీనియర్ కౌన్సిల్ రఘు పాల్గొనగా నాగ చంద్రిక దేవి పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

### 1.1కేజీల గంజాయి స్వాధీనం



గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్న దృశ్యం

**సంజీవరెడ్డి నగర్, మే 27 ప్రభాతవార్త:**
విశ్వసనీయ సమాచారం మేరకు అమీర్‌పేట గాంధీ న్యాచ్‌రోపతి అస్పటల్ దరంకరమ్ రోడ్డులో గంజాయి అమ్మకాలు జరుపుతున్నారని స్పెషల్ టాక్స్‌పోర్స్ సిఐ నాగరాజు, వారి టీమ్ కలిసి 1.1 కేజీల గంజాయిని పట్టుకొని నిందితుడు డి.మధుసూదన్ అనే నిందితుడిని, గంజాయిని అమీర్‌పేట ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించారు.

## అమ్మవారి ఆలయాల్లో అన్నదానం



మణికొండ కెపిఆర్ కాలనీలో నాగులమ్మ మైసమ్మ అమ్మవార్ల ఆలయంలో అమావాస్య సందర్భంగా అన్నదానం చేస్తున్న దృశ్యం

**నార్సింగి, మే 27 ప్రభాతవార్త :** ప్రతీ అమావాస్యకు అమ్మవార్ల ఆలయాల వద్ద భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గండిపేట మండలంలోని మణికొండ కేపీఆర్ కాలనీలో ఉన్న నాగులమ్మ, మైసమ్మ అమ్మవారి ఆలయంలో, అలాగే గంధంగూడ పెద్దమ్మ గుడి ఆవరణలో ప్రతీ అమావస్యకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు జరుగుతున్నాయి. కేపీఆర్ కాలనీలో మండవ ఫౌండేషన్ అధ్యక్షులు మండవ మధుసూధన్ శర్మ అన్నదానం చేయించారు. గంధంగూడ పెద్దమ్మ ఆలయం వద్ద సీనియర్ నాయకులు పెంటయ్య, వెంకటేష్‌లు భక్తులతో కలిసి అన్నదానం చేశారు. మణికొండ మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదానం ప్రాణదానంతో సమానమన్నారు. హిందూ ధర్మంలో అన్నదానంకు అధిక ప్రాధాన్యతనిచ్చారన్నారు. దేవాలయాలలో పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు చేపట్టి, పేదల ఆకలిని తీరుస్తున్నారని తెలిపారు. మహిమాన్విత అమ్మవార్లను కొలిచిన భక్తులకు కొంగు బంగారంగా నిలుస్తూ, కోరికలు తీరుస్తుండడం వలన భక్తుల సంఖ్య గణనీయంగా పెరుగుతుందన్నారు. పక్కవారి ఆకలిని తీర్చే వారి సంఖ్య పెరుగుతుండడం శుభ పరిణామమని రామకృష్ణారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో మణికొండ బిజెపి అధ్యక్షులు రవికాంత్‌రెడ్డి, కెపిఆర్ కాలనీ అధ్యక్షులు గంగాధర్, మాజీ నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజిరెడ్డి పాల్గొన్నారు.

## అమావాస్య సందర్భంగా గోశాలల్లో పూజలు



గోశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

**చార్మినార్,మే 27 ప్రభాతవార్త :** అమావాస్య సందర్భంగా పాతబస్తీలోని షంషేర్ గంజ్ గోశాల,గగన్ పహాడ్ గోశాల, జియాగూడ గోశాలలో భక్తులు పూజలు నిర్వహించారు.భక్తులు ఆవులకు గో సేవా చేశారు. ఆవులకు పచ్చ గడ్డి,కూరగాయలు, ఆహార పదార్థాలు భక్తులు తిని పించారు.జియాగూడ గోశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రభు దత్తు మహారాజ్, హరిక్రిష్ణ, సత్యనారాయణ సోని,పురుషోత్తం గుప్తా,ఫంకజ్ వర్మ,జై కిషన్ ఉపాధ్యాయ,పవన్ వ్యాస్,మనోజ్ సోనీ,మహావీర్ ప్రసాద్ కడేల్,మనక్ చంద్ దేవాల్,షరద్ వర్మ,ఉమేష్ రోడా పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కారిస్తా



శ్యాంనగర్‌లో పర్యటిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

**హైదరాబాద్, మే 27 ప్రభాతవార్త:** గోల్నాక డివిజన్‌లోని శ్యాంనగర్, సుందర్‌నగర్‌లో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ మంగళవారం సందర్శించారు. అక్కడి ప్రజలతో మమేకమై స్థానిక సమస్యలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే వారికి సిసి రోడ్లు, వీధి దీపాలు, మంచినీటి పైప్‌లైన్ సమస్యలను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే వివేకానంద



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద

**కొంపల్లి, మే 27, ప్రభాతవార్త**

కొంపల్లి మునిసిపల్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కెపి వివేకానంద్ గౌడ్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అన్ని విభాగాల ఆధికారులతో కలిసి రాబోయే వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ముఖ్యంగా లోతట్టు ప్రాంతాలను గుర్తించి, డ్రైన్లు, కల్వర్టులను పూర్తిగా శుభ్రపరచాలని నిర్ణయించారు. ముసురుబడి వర్షాలకు ముందుగానే అన్ని ఏర్పాట్లు చేసి ప్రజలకు అధికారులకు ఇబ్బందులు కలుగకుండా సూచనలు జారీ చేసినారు. వరదల ప్రభావం తగ్గించేందుకు ఎమ్మెల్యే అధికారులకు అవసరమైన సూచనలు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రతి శాఖ సమన్వయంగా పనిచేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమం నందు మునిసిపల్ ప్రత్యేక అధికారి ఎ.చంద్ర మోహన్, మున్సిపల్ కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి, మేనేజర్ యస్. వెంకటేశం, అసిస్టెంట్ ఇంజనీర్ పి. ప్రవీణ్ కుమార్, టిపిఒ వాణి, ఏసిపి. కె.వెంకటరెడ్డి, ఇరిగేషన్ ఏఈ వి స్వప్న, నాయిబ్ తాసిల్దార్ అవినాష్, ఏడిఈ ఎం శ్రీకాంత్, డిజిఎం,ఎస్ఓఐ డి.వి. త్రినాథ్ రావు, హెచ్ఎండబల్యూఎస్ఎస్బి శ్రీధర్, మున్సిపల్ ఆధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మాసివ్ ఫాగింగ్ ఆపరేషన్ కార్యక్రమం ప్రారంభం



మాసివ్ ఫాగింగ్ ఆపరేషన్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

**అడ్డగుట్ట, మే 27 ప్రభాతవార్తః**

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యగా అడ్డగుట్ట డివిజన్ పరిధిలో మాసివ్ ఫాగింగ్ ఆపరేషన్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్నలక్ష్మీ శ్రీనివాస్ అన్నారు. దానికి సంబంధించిన కార్యక్రమాన్ని ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బందితో కలిసి కార్పొరేటర్ లాంచనంగా అడ్డగుట్టలో ప్రారంభించారు. జిహెచ్ఎంసి కమిషనర్ ఆదేశాలతో సర్కిల్ పరిధిలోని ఎంటమాలజీ విభాగం అధికారులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్‌గా అడ్డగుట్ట డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో దోమల నివారణే లక్ష్యంగా ఫాగింగ్‌ని నిర్వహించడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజానికి ప్రజల సహకారం కూడా అవసరమని, కావున ప్రజలందరూ ఈ కార్యక్రమంలో సామాజిక బాధ్యతగా భాగస్వాములై వారి వారి ఇండ్ల చుట్టూ అపరిశుభ్రత లేకుండా, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలను పాటిస్తే బాగుంటుందని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్, ఎంటమాలజీ ఏఈ సునీత, సిబ్బంది యూనిస్, దాస్, ఇర్ఫాన్, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ దేవాలయానికి నూతన కమిటీ



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన టెంపుల్ కమిటీ సభ్యులు

**అడ్డగుట్ట, మే 27 ప్రభాతవార్తః**

సికింద్రాబాద్ గణేష్ టెంపుల్ కు నూతనంగా నియమితులైన ఆలయ కమిటి ఛైర్మన్ ప్రభాకర్ యాదవ్ ( అర్వింద్), సభ్యులు పిల్లి మాణిక్య ప్రభు, వేణుగోపాల చారి, బిక్షపతి, మల్లేష్, సాయి కుమార్, అనిల్ యాదవ్, నరేందర్ యాదవ్, ఆంజనేయులు, వంగా నరేష్, నాగమణి, బానపురం నరేందర్, వందన, సంతోష్ ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ధన్యవాదాలు తెలియచేశారు. ఎమ్మెల్యే నూతన కమిటి సభ్యులకు శుభాకాంక్షలు తెలపడంతో పాటు ఆలయ అభివృద్ధికి, భక్తులకు మంచి సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలని సూచించారు. ఆలయ అభివృద్ధికి తన సహకారం ఎప్పుడూ ఉంటుందని హామి ఇచ్చారు.

## వాటర్ లైన్ పనులు ప్రారంభం



పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సామలహేమ తదితరులు

**సికింద్రాబాద్, మే 27 ప్రభాతవార్తః**

మేడిబావిలోని దేడ్ లాక్ బిల్డింగ్ వద్ద వాటర్ వర్క్స్ లైన్ పనులను జల మండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ డాక్టర్ సామల హేమ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పనులను 6 లక్షలతో వ్యయంతో పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దేడ్ లాక్ బిల్డింగ్ పరిసర ప్రాంతాలలో పాతబడిన నీటి పైపుల వల్ల కలుషిత నీరు రావడం, నీటి లీకేజీలు, తక్కువ ఒత్తిడితో సరఫరా వంటి సమస్యలు తలెత్తడంతో కొత్తగా వాటర్ వర్క్స్ లైన్ ఏర్పాటు చేస్తున్నామని, ఈ నూతన లైన్ వేయడం ద్వారా ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడుతున్నామని తెలిపారు. పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు అనంతరం స్థానికులతో మాట్లాడుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఏదైనా సమస్య ఉంటే మా దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్, నాయకులు శైలెందర్, కృష్ణ ముదిరాజ్, సాగర్, మహేష్, పరశురామ్, అనిత, సుజాత, అరుణ, లలితతో పాటు స్థానికులు పాల్గొన్నారు

## బక్రీద్ సందర్బంగా నగరంలో బందోబస్తు : సిపి సి.వి.ఆనంద్

**చార్మినార్, మే 27 ప్రభాతవార్త :** జూన్ నెల ఏడవ తేదీన జరగనున్న బక్రీద్ పండుగ సందర్భంగా హైదరాబాద్ నగరంలో గట్టి బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ తెలిపారు. బక్రీద్ పండుగ సందర్బంగా మంగళవారం సాలార్‌జంగ్ మ్యూజియంలో వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులతో కలిసి నిర్వహించిన సమన్వయ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు. సమావేశంలో పాల్గొన్న ఎంఐఎం శాసన సభ్యులు, ఎమ్మెల్సీలు, ముస్లిం మత ప్రముఖులు బక్రీద్ సందర్బంగా అన్ని ఏర్పాట్లు చేయాలని సమావేశంలో అధికారులను కోరారు. ఈ సందర్బంగా నగర పోలీస్ కమిషనర్ సి.వి.ఆనంద్ మాట్లాడుతూ బక్రీద్ పండుగ సందర్బంగా ప్రతీ సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది కూడ సాలార్‌జంగ్ మ్యూజియంలో ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముస్లిం మత ప్రముఖులతో కలిసి సమాశాన్ని నిర్వహించటం జరిగిందని తెలిపారు. హైదరాబాద్ నగరానికి గొప్ప చరిత్ర ఉందని ప్రజలు ఎంతో ఐకమత్యంతో కలిసి మెలిసి ఉంటారని, ప్రజలు పోలీసులకు తమ సహ సహకారాన్ని అందించాలని ఆయన





కోరారు. బక్రీద్ పండుగ సందర్బంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ సమావేశంలో నగర అదనపు పోలీస్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, జిహెచ్ఎంసి చార్మినార్ జోనల్ కమిషనర్ రఘు ప్రసాద్, ఆర్‌టిఒ రెండు సిజెడ్ ఖైరతాబాద్ డాక్టర్ మల్లేశ్వరి, అదనపు డైరెక్టర్ పశుసంవర్ధక శాఖ డాక్టర్ బాబు బేరి, విద్యుత్ సౌత్ సర్కిల్ ఎస్ఈ సోమి రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యేలు మాజిద్ హుస్సేన్, కౌసర్ మొహియుద్దీన్, మీర్ జుల్ఫికర్ అలీ, జాఫర్ హుస్సేన్ మేరాజ్, మహ్మద్ ముబీన్, ఎమ్మెల్సీలు మీర్జా రహమత్ అలీ బేగ్‌తో పాటు నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన ముస్లిం మత ప్రముఖులు పాల్గొన్నారు.

## 41 గజాల స్థలం హక్కుదారు.. 272 గజాల స్థలం గిఫ్ట్ డీడ్..

### -పక్కోడి స్థలాన్ని కబ్జాపెట్టి షెడ్ వేసిన వారిపై కేసు నమోదు..

**కొంపల్లి, మే 27, ప్రభాతవార్త**

41 గజాల స్థలం హక్కుదారు పక్కనే ఉన్న ఇతరుల స్థలాన్ని కలుపుకొని 272 గజాల స్థలాన్ని ఏకంగా గిఫ్ట్ డీడ్ చేశారు. కబ్జా పెట్టిన స్థలంలో షెడ్ వేయడంతో అసలు ప్లాటుదారు బాచుపల్లి పోలీసులను ఆశ్రయించాడు. బాచుపల్లి పోలీసుల కథనం ప్రకారం నిజాంపేట గ్రామం సర్వేనెంబర్ 233/5 స్థలం పట్టాదారు కమ్మరి బిక్షపతి నుండి 2003లో ఎల్వి రామారావు అను వ్యక్తి 326 గజాల స్థలాన్ని కొనుగోలు చేశాడు. అనంతరం అదే స్థలాన్ని పి శ్రీనివాసరావు అనే వ్యక్తి అదే సంవత్సరంలోనే రమణ రావు నుండి కొనుగోలు చేశాడు. అనంతరం పి శ్రీనివాస రావు నుండి వి సందీప్ రెడ్డి 2015లో అదే ప్లాటును కొన్నాడు. ఈ ప్లాటుకు సమీపంలో సర్వేనెంబర్ 313, 314, 315 సర్వే నెంబర్లలో నిజాంపేట గ్రామానికి చెందిన కొలను కౌసమ్మ, ఆమె కుమారులు పాండురంగారెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు గజాల స్థలానికి హక్కు దారులుగా ఉన్నారు. వీరు 2003లో రాజశేఖర్ అను వ్యక్తికి 272.33 గజాల స్థలాన్ని అమ్మివేశారు. దీంతో వారికి అక్కడ కేవలం 41 గజాలు మాత్రమే స్థలం ఉండాలి. అనంతరం రాజశేఖర్ ఆర్ శ్రీనివాసరావు అను వ్యక్తికి 272.33 గజాల స్థలాన్ని 2005లో అమ్మి వేశాడు. ఇదే స్థలాన్ని ఆర్ శ్రీనివాసరావు 2005లో బి వీరబ్రహ్మాచారి అని వ్యక్తికి విక్రయించాడు. అనంతరం కొలను కౌసమ్మ ఆమె కుమారులు కొలను పాండురంగారెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు తమకు మిగిలి ఉన్న 41 గజాలుకు అదనంగా పక్కవారి స్థలం సందీప్ రెడ్డి ఖాళీ స్థలంలో నుండి పాండురంగా రెడ్డి, మహేశ్వర్ రెడ్డిల సోదరి కందాల సువర్ణ రెడ్డికి ఏకంగా 272 గజాల స్థలాన్ని తల్లి, ఇద్దరు కుమారులు కలిసి 2011లో గిఫ్ట్ డీడ్ చేశారు. అయితే పక్క స్థలం సందీప్ రెడ్డి అప్పుడప్పుడు తన ప్లాట్ దగ్గరికి రావడం చూసుకోవడం తిరిగి వెళ్ళిపోవడం చేసేవాడు. ఇందులో అతను నిర్మాణాలు ఏమీ చేయలేదు. దీంతో కొద్దిరోజుల క్రితం కందాల సువర్ణ రెడ్డి భర్త వెంకట రమణారెడ్డి పక్కన స్థలాన్ని కలుపుకుంటూ ఏకంగా 272 గజాలలో షెడ్డుని ఏర్పాటు చేశాడు. అనంతరం కబ్జాకు గురైన ప్లాటు ఓనర్ సందీప్ రెడ్డి వచ్చి తన స్థలాన్ని చూసుకోగా అందులో పక్క ప్లాట్‌కు సంబంధించిన కందాల సువర్ణ రెడ్డి భర్త వెంకటరమణారెడ్డి ఏకంగా షెడ్డును నిర్మించి ఉంచాడు. దీంతో అతను వెంకటరమణారెడ్డిని తన ప్లాటును ఎందుకు కబ్జా చేస్తున్నారంటూ ప్రశ్నించగా వెంకటరమణారెడ్డి సందీప్ రెడ్డిపై తిరగబడ్డాడు. దీంతో బాధితుడు సందీప్ రెడ్డి బాచుపల్లి పోలీసులను ఆశ్రయించాడు. ఇరువురి స్థలం డాక్యుమెంట్లను పరిశీలించిన బాచుపల్లి పోలీసులు ప్రాథమికంగా కొలను కౌసమ్మ, ఆమె ఇద్దరు కుమారులు పాండురంగారెడ్డి, మహేశ్వర్ రెడ్డిలు సందీప్ రెడ్డి స్థలాన్ని కబ్జా చేసినట్లు నిర్ధారించుకున్నారు. దీంతో కందాల సువర్ణ, ఆమె భర్త వెంకటరమణారెడ్డి, ఆమె సోదరులు కొలను పాండురంగారెడ్డి, కొలను మహేశ్వర్ రెడ్డిలపై కేసులు నమోదు చేశారు. అయితే కొలను కౌసమ్మ మరణించడంతో తప్పుడు పత్రాలతో గిఫ్ట్ డిడి చేసిన పాండురంగా రెడ్డి మహేశ్వర్ రెడ్డిలపై కేసు నమోదు అయ్యాయి. అలాగే కందాల సువర్ణ భర్త వెంకటరమణారెడ్డి షెడ్డు ఏర్పాటు చేసినందుకుగాను అతనిపై కూడా కేసు నమోదు అయ్యాయి. కేసులో సాక్షాలు, పక్కాగా ఆధారాలు సేకరించడం కోసం బాచుపల్లి పోలీసులు మండల రెవెన్యూ అధికారులకు, నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఈ కేసు విషయమై స్పష్టత ఇవ్వమంటూ అభ్యర్థించారు. బాధితుడు ఫిర్యాదు ద్వారా అయిన సందీప్ రెడ్డి స్థలం, నిందితులు కందాల సువర్ణ స్థలం పక్కపక్కనే ఉండడం, కారణంగా రెవెన్యూ సర్వేతో స్థలము ఎవరిది అనేది స్పష్టత వచ్చాక తగు చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

అయితే ఇరు పార్టీల వద్దనున్న డాక్యుమెంట్లను పోలీసులు పరిశీలించగా ప్రాథమికంగా కందాల సువర్ణ, పాండురంగారెడ్డి, మహేశ్వర్ రెడ్డి, వెంకటరమణారెడ్డిలు సందీప్ రెడ్డి స్థలాన్ని కబ్జా పెట్టినట్లు స్పష్టం అవుతుంది. దీంతో నిందితులపై కేసులు నమోదు చేసి బాచుపల్లి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

**కంటోన్మెంట్, మే 27 ప్రభాతవార్తః**

కంటోన్మెంట్ వార్డు 5 కాకాగూడలోని శ్రీ వీరాంజనేయ స్వామి సహిత శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి శ్రీపాద వల్లభ శ్రీగురు దత్తాత్రేయ దేవాలయంలో అమావాస్య సందర్భంగా నిర్వహించిన హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీగణేష్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ఆ తరువాత ఆలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామి వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ప్రజలకు ఆయురారోగ్యాలు మరియు సుఖసంతోషాలు కలగాలని కోరుకున్నట్టు తెలిపారు. ఆలయంలో పూజలు నిర్వహించడం సంతోషాన్ని ఇచ్చిందని, ఆలయ అభివృద్ధికి అన్ని విధాల సహకరిస్తానని ఎమ్మెల్యే తెలపారు. ఆలయ కమిటి సభ్యులు ఎమ్మెల్యేకు స్వాగతం పలకడంతో పాటు వేదశీర్వచనం తీర్థప్రసాదాలు అందించారు.

### నాణ్యత ప్రమాణాలు పాటించాలి : కొంతం దీపిక



వెస్ట్ మారేడ్‌పల్లిలో రోడ్డు పనులను పర్యవేక్షిస్తున్న కార్పోరేటర్ కొంతం దీపిక

**కంటోన్మెంట్, మే 27 ప్రభాతవార్త:** ఈస్ట్ మారేడ్‌పల్లి రోడ్డు నెం 6లో కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపిక తెలిపారు. మంగళవారం ఆమె ఈస్ట్ మారేడ్‌పల్లి కొనసాగుతున్న రోడ్డు పనులను ఆమె పర్యవేక్షించారు.

## ఘనంగా ఆళ్వార్ తిరుమంజనం



దేవాలయంలో ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమంలో పాల్గొన్న ప్రతినిధులు

**సైఫాబాద్, మే 27 ప్రభాతవార్త:** లిబర్టి వద్దగల టిటిడి బాలాజీభవన్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం దేవాలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం కార్యక్రమం ఘనంగా జరిగింది. జూన్ 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు దేవాలయం వార్షిక బ్రహోత్సవాలు జరగనున్నాయి. జూన్ 2వ తేదీ సాయంత్రం 6 గంటలకు అంకురార్పణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. ఈ బ్రహ్మోత్సవాలకు సంబంధించిన అన్ని ఏర్పాటు చురుకుగా కొనసాగుతున్నాయి. నేటి కార్యక్రమంలో టిటిడి ఎఇవొ యు. రమేష్, డోనర్ వై.టి.వి.త్రినాథ్‌బాబు, టిటిడి అధికారులు శ్రీనివాసప్రభు, ఆత్మకూరి శ్రీనివాస మణికంఠ, లక్ష్మీపతి, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి -ఆరెకపూడి గాంధీ



లబ్ధిదారులకు చెక్కును పంపిణీ చేస్తున్న గాంధీ

**వివేకానంద నగర్ కాలనీ, మే 27, ప్రభాతవార్త :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని శేరిలింగంపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి మండలం పరిధిలోని ఆల్విన్ కాలనీ, వివేకానంద నగర్, హైదర్ నగర్, కూకట్‌పల్లి పార్ట్ కాలనీలోని షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు సోమవారం వివేకానంద నగర్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆయన నివాసం వద్ద కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద ఆడబిడ్డలకు దేశంలో ఎక్కడా లేనివిధంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశ పెట్టడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయినేని చంద్రకాంత్ రావు, హరినాథ్, నాగేశ్వరరావు, అష్రఫ్, శ్రీకాంత్, యాసీ న్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



నారాయణగూడలోని హిమయత్ నగర్ ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో అమావాస్య సందర్భంగా అన్నదానం కార్యక్రమములో పాల్గొన్న ప్రెసిడెంట్ నర్సింగ్ రావు,సెక్రేటరీ రమేష్ ,వైస్ ప్రెసిడెంట్స్ లక్ష్మణ్ కుమార్ , ఎం.కృష్ణ ,వినయ్ ,అమర్ , ఉదయ్, తదితరులు

## సబ్సిడీ రుణాలు ఇచ్చి ప్రోత్సహించండి

### -కేంద్రమంత్రి జితెన్‌రామ్ మాంజీకి వినతి

**హైదరాబాద్, మే 27, ప్రభాతవార్త:**

ఎమ్ఎస్ఎంఈల తరాహాలో ట్రేడర్స్ కికూడా బ్యాంకు రుణాలు ఇచ్చి ప్రోత్సహించాలని కేంద్రమంత్రి జితెన్‌రామ్ మాంజీని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కోరింది. ఈమేరకు హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో నిర్వహించిన సమావేశానికి కేంద్రమంత్రి ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఛాంబర్ అధ్యక్షులు ప్రకాశ్, ప్రతినిధులు సతీష్ కేంద్రమంత్రికి పలు అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. జివిస్టీ స్లాబుల్ విషంలో కూడా 5శాతం చేయాలని కోరామని ఆన్‌లైన్ ప్లాట్‌ఫ్లామ్ ప్రభావం వల్ల మీడియం, స్మాల్ ట్రేడర్స్ కి తీవ్ర నష్టం జరుగుతుందని వారికోసం ఒపాలసీని రూపొందించాలని



మాంజీకి వినతిపత్రం ఇస్తున్న అధ్యక్షుడు ప్రకాశ్, సతీష్ తదితరులు

కోరామన్నారు. చిన్న,సూక్ష్మ మధ్యతరహా పరిశ్రమల అభివృద్ధికి మరిన్ని సంస్కరణలు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి ట్రేడర్స్, టెక్స్‌టైల్స్ ఇండ్రస్టీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## గండిమైసమ్మ వరకు ఆర్టీసి బస్సు సర్వీసును పొడిగించాలి

**నిజాంపేట్, మే 27, ప్రభాతవార్త**

జెఎన్‌టియుహెచ్ కూకట్‌పల్లి నుంచి నిజాంపేట్ జర్నలిస్టు కాలనీ మీదుగా గండిమైసమ్మ వరకు ఆర్టీసి బస్సు సర్వీసును పొడిగించాలని నివాస్ జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం ప్రెసిడెంట్ తన్నీరు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ముక్కర్ల లాలయ్య, జనరలల్ సెక్రటరీలు మంగళవారం ఎమ్మెల్యే కెపి వివేకానందను కలిసి కోరారు. ఈ సందర్భంగా సంఘం సభ్యులు మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నిర్మించిన డబుల్ బెడ్రూమ్ ఇండ్ల సముదాయాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు ప్రారంభించాలని ఆర్టీసీ అధికారులకు చేసిన ఆదేశాల మేరకు నిజాంపేట డబుల్ బెడ్రూమ్ ఇండ్లకు సైతం బస్సులు నడపడం శుభదాయకమని అన్నారు. అయితే డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వరకు ప్రారంభించిన సర్వీసులను గండిమైసమ్మ చౌరస్తా వరకు కొనసాగిస్తే మరింత ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎందుకంటే ఈ మార్గంలోనే సురవరం ప్రతాప్ రెడ్డి తెలుగు యూనివర్సిటీతో పాటు ఇంజనీరింగ్ కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థలు ఉన్నాయని, చుట్టుపక్కల కొత్తగా ఎన్నో కాలనీలు, బస్తీలు ఏర్పడ్డాయన్నారు. కుత్బుల్లాపూర్ మండల కార్యాలయానికి వివిధ పనులపై రావాలంటే సరైన రవాణా సౌకర్యం లేక సామాన్య, మధ్యతరగతి ప్రజలు



ఎమ్మెల్యే వివేకానందను కలిసిన నివాస్ జర్నలిస్ట్ కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు

ఇబ్బందులు పడే పరిస్థితులు ఉన్నాయన్నారు. అలాగే దినసరి కూలీలు, అడ్డా కార్మికులు పనుల కోసం గండిమైసమ్మ ప్రాంతానికి నిత్యం రాకపోకలు సాగిస్తుంటారని, ఆర్టీసీ బస్సులను గండిమైసమ్మ వరకు నడిపితే వారందరికీ ఎంతో సౌకర్యవంతమైన ప్రయాణం అందించినవారవుతారని అన్నారు. అదేవిధంగా బోనాలు సమీపిస్తున్న దృష్ట్యా జర్నలిస్ట్ కాలనీలో కొలువుదీరిన చెర్ల ఎల్లమ్మ దేవాలయానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు చేపట్టి త్వరితగతిన పూర్తయ్యేలా చూడాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఎమ్మెల్యే వివేకానంద సానుకూలంగా స్పందించారని సభ్యులు తెలిపారు.

## బ్రాహ్మణవాడీ ప్రాంతంలో సమస్యలు పరిష్కరించాలి : కోట నీలిమ

**బేగంపేట మే 27,ప్రభాతవార్త**

వర్షాకాలానికి ముందుగానే బేగంపేట డివిజన్ బ్రాహ్మణవాడీ పరిధిలోని బస్తీలలో అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ అధికారులకు సూచించారు. మంగళవారం బేగంపేట డివిజన్ పరిధిలోని బ్రాహ్మణవాడీ బస్తీలో కోట నీలిమ,సీనియర్ నాయకులు విశాల్ సుధామ్,వివిధ శాఖల అధికారులతో కల్సి పర్యటించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న సమయంలో కూకట్‌పల్లి నాలా పరివాహక బస్తీలైన ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ,బ్రాహ్మణవాడీ,వడ్డెర బస్తీ,ఆర్ ఆర్ గోపాల్ కాంపౌండ్,తదితర ప్రాంతాల్లో నాలా నీటి ప్రవాహం చేరి ప్రజలు ఇబ్బంది పడకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.బ్రాహ్మణవాడీ లైన్ నెంబర్ 1 నుంచి 7లైన్లను ఆమె అధికారులతో కల్సి సందర్శించారు.వరదనీటి నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించాలని,డ్రైనేజీ ,వీధిలైట్లు,విద్యుత్ స్తంభాలు తదితర సమస్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను అధికారులతో చర్చించారు.ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమీషనర్ డాకు నాయక్,హెచ్ఎంఎన్‌డబ్ల్యూ ఎస్ ఎస్ బి జనరల్ మేనేజర్ వినోద్,టీఎస్ఎస్పీడీసీఎల్ ఏఈ సాయి,పోలీసు అధికారులతో పాటు వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.కాంగ్రెస్ పార్టీ నాయకులు విశాల్ సుధామ్,మునీర్‌ఖాన్,హనీఫ్‌ఖాన్,సలీమ్‌ఖాన్,మనోజ్‌కువార్,మొలుగూరి కృష్ణ,అల్తమాష్, చిరంజీవి, నసీరుద్దీన్ (అడ్డూ),తస్లీమ్,సబా,జగదీష్,అంజిబాబు పాల్గొన్నారు.



బ్రాహ్మణవాడీలో సమస్యలు తెలుసుకుంటున్న డా.కోట నీలిమ.

**నెహ్రూకు నివాళులు అర్పించిన కోటనీలిమ**

దివంగత మాజీ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 61వ వర్ధంతి సందర్భంగా బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద కాంగ్రెస్ నాయకులు హనీఫ్ ఖాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డా.కోట నీలిమ పాల్గొని జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు విశాల్ సుధాం, నసీరుద్దీన్ (అడ్డూ),మునీర్‌ఖాన్,సలీంఖాన్,తస్లీం,పి.ఎల్.కృష్ణ,చిరంజీవి,జగదీష్,మనోజ్,సుభాష్,సాయి,సబ పాల్గొన్నారు.

## శవాల దహనంపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జ్ చేత న్యాయ విచారణ జరిపించాలి

### -ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక

**చిక్కడపల్లి, మే 27 ప్రభాతవార్త:** చత్తీస్‌ఘడ్ ప్రభుత్వం ఆ రాష్ట్రంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన వారి మృతదేహాలను తమంతట తావమే దహనం చేయడం అత్యంత దారుణమని తీవ్రంగా ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక తీవ్రంగా ఖండించింది. మంగళవారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నేతలు తీవ్రంగా నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మృతదేహాలను కుటుంబీకులకు అప్పజెప్పడానికి నిరాకరించి ప్రభుత్వమే దహనం చేసినందుకు ఖండించింది. ఈ సమావేశంలో వేదిక కన్వీనర్లు ప్రొఫెసర్ హరగోపాల్, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్, కోఆర్డినేటర్ గడ్డం లక్ష్మణ్, ఎస్.నారాయణ రావు, పివోడబ్ల్యు ప్రతినిధి స్వరూప, సునీత, పౌరహ క్కుల సంఘం నుంచి రఘుతో పాటు ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల సభ్యులు పాల్గొన్నారు. శవాలను దహనం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డి మాండ్ చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రప్రభుత్వాల పాశవిక వైఖరిని వ్యతిరేకిస్తున్నామని, ఈ సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జ్ చేత న్యాయ విచారణ జరిపిం చాలని, కేంద్ర ప్రభుత్వం ఛత్తీజ్‌ఘడ్,ఆంధ్రప్రదేశ్, తెలం గాణ ప్రభుత్వాలు దేశంలో నెలకొన్న విషాదానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 21న ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి వంబాం కేశవరావు మరో 26 మంది చనిపోవడంతో సమాజమంతా భావోద్వేగానికి గురయ్యారని, చింతగట్టుకు చెందిన బూర రాకేష్ మాతృ మూర్తి అన్నపానీయాలు ముట్టడం లేదని, అన్ని కుటుంబాల సభ్యులందరు తీవ్ర మనోవేదనకు గురయ్యారని సమావేశం ఆవేదన వ్యక్తం చేసింది. చత్తీస్‌ఘడ్ ప్రభుత్వ ప్రవర్తన దారుణంగా వ్యవహరించిందని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బాహాటంగానే బాధతో ఉన్న బాధిత కుటుంబాన్ని తీవ్రంగా హెచ్చరించారని, ఎట్టి పరిస్థితుల్లో ప్రధాన కార్యదర్శి మృతదేహాన్ని, నవీన్, సంగీతల మృతదేహాలను ఆంధ్రప్రదేశ్ తీసుకురావడానికి వీలు లేదని గట్టిగానే బెదిరించారని వివరించింది.



ప్రసంగిస్తున్న ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక కోఆర్డినేటర్ ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్

## విద్యార్థి చదువు కోసం ఆర్థిక సహాయం

**యూసుఫ్‌గూడ, మే 27, ప్రభాతవార్త :** ఉన్నతమైన విద్యను అభ్యసించేందుకు తన తోటి వారికి తనకున్న దానిలో కొంత ఆర్థిక సహాయం చేస్తూ ఓ విద్యార్థిని తన ఉదారతను చాటుకుంది. తన కిడ్డి బ్యాంకు నుంచి తేజామయి నాయుడు రూ.25వేల రూపాయలను స్కూల్ ఫీజు కట్టలేక పోతున్న 9వ తరగతి చదువుతున్న విశాల్‌కు ఆర్థిక సహాయం అందజేసింది. గాయత్రినగర్‌లో నివసించే లయన్ కెల్ల వెంకటరావు కుమార్తె తేజామయి నాయుడు స్కూల్ వద్దకు వెళ్ళి విద్యార్థికి నగదును అందజేసింది. ఈకార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ మహేందర్‌రెడ్డి, ప్రసిడెంట్ కైలాస్, కృష్ణయ్య, దామోదర్, సత్యనారాయణ, రమేష్ నాయుడు, శ్రీలత, సౌజన్య, వాణి, పాల్గొన్నారు.




తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
GHMC

ఇ-ప్రొక్యూర్‌మెంట్ నోటీస్ నం.04/EE/DIV.No.19/SLPZ/GHMC/2025-26/60 తేది: 27.05.2025, నిట్ నం.04/EE/DIV.No.19/SLPZ/GHMC/2025-26, పనుల సంఖ్య: (6) నం.ల ఇతర పనులు (1) నం. సివిల్ పని, అంచనా మొత్తం: రూ.లక్షలలో: 236.40, ప్రారంభ తేదీ, డౌన్‌లోడ్ ముగింపు తేదీ మరియు సమయం: 28.05.2025 మ.01.00 గం. 02.06.2025 మ.01.00 గం. వరకు మాత్రమే. అధికారి పేరు, చిరునామా: ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, GHMC, శ్రీ U. రాజ్ కుమార్, 9963550654. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ @ https://www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును. సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, (SLPZ), GHMC

DIPR.No.2598-PP/CL/Advt/1/2025-26, తేది: 27.05.2025

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL-2, 1ST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD

OA NO 75 OF 2020

Between:
INDIAN BANK ...APPLICANT
AND
T. Sangameshwar & Another ....DEFENDANTS

To,
1. (D2). Smt. G. Sunitha Latha, W/o Mr. R. Xaviour, Age: 54 Years, Occ: Govt Employee, Gender: Female, H.No.11/3A, BHEL Township, Qt.No.10, Near NH -1, RC Puram, Hyderabad, Telangana - 502032.

SUMMONS BY PAPER PUBLICATION FOR SHOWING CAUSE AS TO WHY THE RELIEF PRAYED SHOULD NOT BE GRANTED

Whereas the applicant bank has instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993 against you for recovery of Rs.35,34,082 together with current and future, interest and other reliefs and the same posted to 10-06-2025 at 10.30 A.M. for your appearance. You are hereby required to show cause within 30 days from the date of summons or on the date and time mentioned above either in person or by Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take notice that in case of default, the application will be heard and determined in your absence.
Given under my hand and the seal of this Tribunal on this 26TH day of May-2025.

Registrar
Debts Recovery Tribunal-2
Hyderabad.

IN THE COURT OF THE HON'BLE XTH JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD.
O.S. NO. 1568 OF 2025

Between:
1) Smt. Nukala Satyavani W/o Nukala Subrahmanyam, Age: 60 yrs, Occ: House wife, R/o H.No: 1-10-179, SBH Colony, Ashok Nagar, Hyderabad-500020, Telangana State.
2) Smt. Nukala Srilakshmi W/o Vadlamani Eswar Srinivas, Age: 39 yrs, Occ: House wife, R/o. 2022, SOBA AVENUE APPARTMENT, DODDABANAHALLI, KANNAMANGALA, Bangalore, Karnataka-560067.
3) Smt. Nukala Naga Venkata Nikhilesh S/o Late Nukala Subrahmanyam, Age: 35 yrs,Occ: Pvt Service, H.No: 1-10-179, SBH Colony, Ashok Nagar,Hyderabad-500020, Telangana State.
....PLAINTIFFS
And
1) MRO, Himayathnagar, Hyderabad.
2) All concerned ...Defendants

To,
All Concerned
Please take notice that the above suit filed by the plaintiffs against all concern and MRO Himayathnagar Mandal, Hyderabad to declare the status of the plaintiffs as legal heirs of deceased Late Nukala Subrahmanyam before the above said court, as per the court order the plaintiffs issued the notice to all concern through publication in vartha daily news paper to concern person/persons for your appearance on 09-06-2025 at 10-30 A.M. before the above said court. Please make it convenient and attend on said date either in person or through an advocate; otherwise, the matter will be decided in your absence as per law.
(BY ORDER OF THE HON'BLE COURT)

C. RAMA KUMARI
ADVOCATE
HYDERABAD

PUBLIC NOTICE

General Public is hereby informed and notified that our client is intending to purchase the agricultural land to the extent of 01.26 Ac. Gts. (out of total extent of 03.00 Ac.Gts.) in survey No. 121/1/1/1/1/1/2, & 121/1/2, Mudimyal Village, Chevella Mandal, Ranga reddy Dist., T.S., from its lawful owner Smt. Eega Latha Sujatha W/o. Eega Damodar Reddy, for valuable Sale Consideration. Any person (s) having any right, title or interest in respect of the above properties shall intimate their objections within 10 days from the date of this publication, or other wise the transaction may be completed at the option of our client. The objections, if any, received thereafter shall be deemed to have been waived.

M/S. SHALAX LAW FIRM
G. JAGADISH & ASSOCIATES
Advocates
Pandu Ranga Nagar, Attapur, Rajendernagar, Ranga Reddy, Dist – 500 048.
Cell No. : 08143190324
e-mail:shalax9@gmail.com

## ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కేకును కొస్తున్న పూర్వ విద్యార్థులు.

**హయత్ నగర్, మే 27, ప్రభాతవార్త :** పెద్ద అంబర్ పేట జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 198990 బ్యాచ్ పదవ తరగతి విద్యార్థులు మంగళవారం గండి మైసమ్మ తల్లి దేవాలయం ప్రక్కన మినీ ఫంక్షన్ హాల్లో కలవడం జరిగింది. ఈ సందర్భంగా గడిచిన 35 సంవత్సరాల నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కేకును కట్ చేసి ఆనందంగా గడిపారు. పసుల కుమార్, బుయ్య జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సుమారు 40 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కాగార్‌ను వెంటనే నిలిపివేయాలి



మహాసభలో మాట్లాడుతున్న రవీంద్రా చారి.

**హయత్ నగర్, మే 27 ప్రభాతవార్త :**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ పేరుతో ఎన్ కౌంటర్ చేసి అమానుషంగా చంపుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్ర చారి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి అన్నారు. మంగళవారం కుంట్లూరులో జరిగిన పార్టీ రాజీవ్ గృహకల్పశాఖ మహాసభలో వారు మాట్లాడుతూ... ఇటీవల జరిగిన ఛత్తీస్ ఘడ్ ఎన్ కౌంటర్లో మావోయిస్టు నాయకులను పట్టుకొని కాల్చి చంపారని ఆరోపించారు. కనీసం మృత దేహాలను సైతం కుటుంబ సభ్యులకు అప్పగించకుండా పోలీసులే సామూహిక దహనాలు చేయడం అమనవీయమన్నారు. శాంతి చర్చలకు అంగీకరించక పోవడం ప్రభుత్వ దుర్మార్గానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ కగార్ ను వెంటనే నిలిపి వేసి చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు హరిసింగ్ నాయక్, యాదయ్య, గణేష్, రాము, వెంకట్, బాబు, వలి, నరసింహ పాల్గొన్నారు.

## డివిజన్ అభివృద్ధి,సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

### - కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి



జిహెచ్ఎంసి రివ్యూ మీటింగ్‌లో కార్పొరేటర్ లచ్చిరెడ్డి తదితరులు

**వనస్థలిపురం. మే.27.ప్రభాతవార్త.**
ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో హైదరాబాద్ జిహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మీ ,జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రివ్యూ మీటింగ్ కార్యక్రమంలో బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ జిహెచ్ఎంసి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హజరైయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో రోడ్ల కొరకు నిధులు మంజూరు చేయాలని, శివారు కాలనీలా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, పలు కాలనీలలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, కాలనీలో పరిశుభ్రం దృశ్య ఇప్పుదున్న కార్మికులు సరిపోవడం లేదని కావున నూతన కార్మికులను నియమించాలని, రానున్న వర్షాకాలం అని దృష్టిలో పెట్టుకొని మాన్సూన్ అత్యవసర సిబ్బంది ఏర్పాటు చేయాలని మరియు కాలనీలలో ఖాళీగా ఉన్న పార్కు స్థలాలు కబ్జాకు గురికాకుండా ఉండేందుకు ప్రహరి గోడలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ నియోజకవర్గ కార్పొరేటర్లు, జిహెచ్ఎంసి అధికారులు ఉన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



జి.ఎచ్.ఎం. సి. రివ్యూ మీటింగ్ లో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుజాత నాయక్.

**వనస్థలిపురం మే.27, ప్రభాతవార్త :**
ఎల్బీనగర్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మీ ఆధ్వర్యంలో ఎల్బీనగర్ జోన్ పరిధిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హస్తినాపురం కార్పొరేటర్ మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్ పరిధిలో జరుగుతున్న ఎస్ ఎన్ డి పి నాలా పనులు నత్త నడకన జరుగుతున్నాయని ఏపీ ఎస్సీబీ కాలనీ నుండి బైరమల్ గూడా చెరువు వరకు జరుగుతున్న పనులు నత్త నడకన సాగుతున్నాయని అదేవిధంగా వందనపురి కాలనీ నుండి కేకే గార్డెన్ వరకు పనులు ఇంకా మొదలు కాలేదని ద్వారకా నగర్ నుండి డి ఆర్ డి ఎల్ కాలనీ వరకు పనులు ప్రారంభం కాలేదని తెలిపారు.దీనికి స్పందించిన మేయర్ గద్వాల విజయలక్ష్మీ త్వరలోనే పనులను వేగవంతం చేస్తామని ఏవైతే పనులు మొదలు కాలేదు వాటిని తక్షణమే ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పటేల్ మరియు వివిధ విభాగాల అధికారులు వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు

## పిన్ బదురుల ఆశ్రమ పాఠశాలలో అడ్మిషన్లు

**మలక్ పేట ,మే 27, ప్రభాతవార్త :**
ముసారాంబాగ్ మెట్రో స్టేషన్ వద్ద ఉన్న ఫిన్ బదురుల ఆశ్రమ (చెవిటి మూగ) పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు జరుగుతున్నాయని పాఠశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినికిడి లోపం గల బాల, బాలికలు అర్హులని తెలిపారు.1వ తరగతి నుంచి 7వ తరగతి వరకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులకు ఉచితంగా స్పీచ్ థెరపీ, కంప్యూటర్ విద్య, పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, స్కూలు యూనిఫాంలు, హాస్టల్ వసతి తదితర సౌకర్యాలు కల్పి స్తున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 770224322, 94 40943677, 8977043422లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

## కార్మికుల శ్రమ లేకుండా దేశ ప్రగతి లేదు : ఓరుగంటి యాదయ్య



**తుర్కయంజాల్, మే 27 ప్రభాతవార్త :**
కార్మికుల శ్రమ లేకుండా దేశ ప్రగతి లేదని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య అన్నారు. భవన నిర్మాణ కార్మికుల తుర్క యంజాల్ సిపిఐ పార్టీ శాఖ మహాసభ భాస్కర్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య మాట్లాడుతూ... దేశ అభివృద్ధిలో కార్మికులు కీలక భూమిక పోషిస్తున్నారని అన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు ప్రభుత్వం అన్ని రకాలుగా ఆదుకోవాలని, నెలకు రూ. 7500/ పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎర్ర జెండా కష్టాల్లో ఉన్న ప్రజల సమస్యల పైన అలుపెరుగని పోరాటం చేస్తుందని, కష్టాల్లో ఉన్న ప్రజలకు ఎర్రజెండా ఒక దిక్సూచి అని అన్నారు. దేశంలో అన్ని తరగతుల ప్రజల సమస్యల పైన వాస్తవికత దృక్పథంతో పోరాడుతుందని అన్నారు. పోరాటం, ప్రశ్నించడంతోనే మనిషి మనుగడ ప్రారంభమైందని అన్నారు. నేటి పాలక ప్రభుత్వాలు ప్రశ్నించడాన్ని, పోరాటాలు చేయడాని సహించలేకపోతున్నాయి అని అన్నారు. రాజ్యాంగంలో కల్పించిన సమాన అవకాశాలను అమలు చేయకుండా దేశ ప్రజలను వంచిస్తున్నారని,ఆర్థిక అసమానతలతో దేశ ప్రజలు సతమతమవుతుంటే పాలకులు ధనికులకు ఊడిగం చేస్తున్నారని అన్నారు.ఈ సందర్భంగా నూతన శాఖ కార్యదర్శి ఎస్. దేవ నాయక్, సహాయ కార్యదర్శిగా నాగేశ్వరరావును ఏన్నుకున్నారు.నూతన కార్యవర్గ సభ్యులుగా హనుమంతు, శంకర్ నాయక్, రాములు, లక్ష్మి, నీలా విజయ కోటియా నాయక్, నరసింహ లను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పి. శివకుమార్ గౌడ్, నాయకులు భాస్కర్, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# సింధూరుకు మద్దతుగా భారీ ప్రదర్శన

## -హాజరైన ఎంపిలు, కార్పొరేటర్లు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్ చిత్రంలో విశ్వేశ్వర్ రెడ్డి

**ఎల్‌బినగర్, మే 27 ప్రభాతవార్త:**
భారతదేశ పరాక్రమానికి ప్రతీక అయిన ఆపరేషన్ సింధూర్ విజయాన్ని స్మరించుకుంటూ, మన భారత సైనికుల వీరత్వాన్ని వారి త్యాగాన్ని గౌరవిస్తూ, సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యులు ఈటెల రాజేందర్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా రూరల్ అధ్యక్షులు రాజభూపాల్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా బిజెపి మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్లు వంగ మధుసూదన్‌రెడ్డి, రాధాధీర జ్‌రెడ్డి, చింతల అరుణసురేందర్‌యాదవ్, నాయికోటి పవన్ కుమార్ , కొప్పుల నరసింహరెడ్డి, రంగ నరసింహగుప్త, లచ్చిరెడ్డి మహేశ్వరం నియోజకవర్గ ఇన్చార్జ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందెల శ్రీరాములు యాదవ్‌లు హాజరై జాతీయ జెండాలను పట్టుకుని ర్యాలీగా తరలి వెళ్లారు. దిల్‌సుఖ్‌నగర్ బస్‌స్టాండ్ నుండి కొత్తపేట అష్టలక్ష్మీ దేవాలయ ఆర్చ్ వరకు సాగిన భారీ ర్యాలీలో భారత్ మాతాకీ జై అంటూ ప్రధాని నరేంద్ర మోడీ భారత సైనికులకు జై కొడుతూ ముందుకు సాగారు. ఈ కార్యక్రమంలో నాయకులు పిట్ట ఉపేందర్‌రెడ్డి, ధీరజ్‌రెడ్డి, ఎలిమినేటి జంగారెడ్డి, బత్తుల సుమన్‌గౌడ్, రాములు యాదవ్, సంతోష్, గీతారెడ్డి, సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## యువత రాజకీయాల్లోకి రావాలి : సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవీంద్రచారి



లెనిన్‌నగర్ సిపిఐ వార్డు మహాసభకు హాజరైన పార్టీ నాయకులు

**సరూర్‌నగర్, మే 27 ప్రభాతవార్త:**
యువత రాజకీయాల్లోకి రావాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి పిలుపునిచ్చారు. మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని లెనిన్‌నగర్ సిపిఐ కార్యాలయంలో పార్టీ వార్డు మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు రెడ్యా నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రవీంద్రచారి మాట్లాడుతూ దేశ జనాభాలో సగం యువతే ఉందనీ వారి చేతుల్లోనే దేశ భవిష్యత్తు ఉందని అన్నారు. ఈ మేరకు యువత సమాజానికి ఉపయోగపడే విధంగా రాజకీయాల్లోకి రావాలని సూచించారు. దోపిడీ వ్యవస్థను అంతమొందించాలంటే యువతతోనే సాధ్యమని ఆయన అన్నారు. అనంతరం సిపిఐ మీర్‌పేట్ కార్పొరేషన్ 33వ వార్డు కమిటీని ఎన్నుకున్నారు. ఈ మేరకు కార్యదర్శిగా జాతోతు రెడ్యా నాయక్, సహాయ కార్యదర్శిగా మిరియాల లక్ష్మమ్మ, కౌన్సిల్ సభ్యులుగా కేతావత్ శ్రీను నాయక్, వడ్త్యా దత్తు నాయక్, మహేందర్, గోవింద్ నాయక్, కైలాస్ నాయక్, వెంకటయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మహాసభలో మండల సిపిఐ కార్యదర్శి ముకుందంగారి చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు దేరంగుల శంకరయ్య, రమావత్ పాండు నాయక్, బండ యాదమ్మ యాదవ్, జాజాల అంజయ్య, రమావత్ చత్రు నాయక్ పాల్గొన్నారు.

## గృహ హింసపై మహిళలకు అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

**సైదాబాద్, మే 27 ప్రభాతవార్త:** సైదాబాద్ పోలీస్ స్టేషన్ సిడిఇడబ్లు(సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ ఉమెన్) ఆధ్వర్యంలో మాధవనగర్ కాలనీలో జరిగిన కార్యక్రమంలో మహిళలకు గృహ హింస గురించి అవగాహన కలిగించారు. గృహ హింసలోని రకాల గురించి వివరించారు. గృహ హింసకు గురైన మహిళలకు ఉమెన్ సేఫ్టీ వింగ్, సిడిఇడబ్లు ఫ్యామిలీ కౌన్సిలింగ్ సెంటర్లలో అందజేసే సదుపాయాల గురించి వివరించారు. సైదాబాద్ ఎస్ హెచ్ఓ బి.చంద్రమోహన్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

### నెహ్రు ఆశయ సాధనకు కాంగ్రెస్ సేవాదళ్ కృషి : జితేందర్



నెహ్రు చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న మిద్దెల జితేందర్

**సైదాబాద్, మే 27 ప్రభాతవార్త:** మన దేశ మొదటి ప్రధాని, భారతరత్న పండిట్ జవహర్‌లాల్ నెహ్రు వర్ధంతి సందర్భంగా తెలంగాణా ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పండిట్ జవహర్‌లాల్ నెహ్రు చిత్ర పటానికి సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జితేందర్ మాట్లాడుతూ దేశానికి దశ, దిశ చూపిన గొప్ప నాయకుడు పండిట్ జవహర్‌లాల్ నెహ్రు అని అన్నారు. పంచవర్ష ప్రణాళికలతో దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించారని అన్నారు. జవహర్‌లాల్ నెహ్రు ఆశయ సాధనకు కాంగ్రెస్ సేవాదళ్ కృషి చేస్తుందన్నారు.

### టిడిపి మహానాడుకు తరలివెళ్లిన ఉప్పల్ నేతలు



టిడిపి మహానాడు కార్యక్రమంలో పాల్గొన్న ఉప్పల్ టిడిపి నేతలు కందికంటి అశోక్‌గౌడ్ తదితరులు

**ఉప్పల్, మే 27 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ 43వ మహానాడు కార్యక్రమానికి ఉప్పల్ నుంచి పలువురు పార్టీ నేతలు తరలివెళ్లారు. టిడిపి మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జీ కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ సీనియర్ నేతలు బక్కని నరసింహులు, తిక్క ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ తెలంగాణలో కూడా టిడిపి బలంగా ఉందన్నారు. టిడిపితోనే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. టిడిపికి పూర్వ వైభవం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.

## శివ శంకర మహామాయి ఆలయంలో విశేష పూజలు



ఉప్పల్ శివ శంకర మహామాయి ఆలయంలో విశేష పూజలు, అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం.

**ఉప్పల్, మే 27 ప్రభాతవార్త :** ఉప్పల్‌లోని శ్రీ శివ శంకర మహామాయి ఆలయంలో మంగళవారం వైశాఖ అమావాస్య సందర్భంగా మహామాయి దేవి విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్న ప్రసాద విరతణ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆలయ కమిటి నేతలు ఉప్పోజి బల్వంతాచారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విశ్వకర్మ ఆత్మ గౌరవ భవనం చైర్మన్ లాలుకోట వెంకటాచారి, ఉప్పోజి బిక్షపతి, శ్రీను, రాజగోపాల్‌చారి, మధు చోల్లేటి, పురుషోత్తమ్, బ్రహ్మచారి, శ్రీనివాస్, శ్రీధర్, పల్లెర్ల గోపి, చిరంజీవి, శామీర్‌పేట హనుమంతరెడ్డి, పూదూరి కృష్ణారెడ్డి, మామిళ్ల బాలరాజు, నర్సింగ్‌రావు, తురాయి దాసు, అనిల్‌రెడ్డి, ఎం.జగన్, తీగ విఠల్‌రావు, నర్సింగ్‌రావు, వెంకటయ్య, సందీప్, సంతోష్, సాయి, శ్రీనివాస్‌గౌడ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రతి నెల అమావాస్య రోజున అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

### నేషనల్ యాక్షన్ ఫర్ మెకానైజ్ సానిటేషన్ ఈకో సిస్టంపై అవగాహన సదస్సు



పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

**సరూర్‌నగర్, మే 27 ప్రభాతవార్త:** బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో మంగళవారం నేషనల్ యాక్షన్ ఫర్ మెకానైజ్ సానిటేషన్ ఈకో సిస్టం (నమస్తే) కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కేరళకు చెందిన జెన్ రోబోటిక్ సంస్థ ఆధ్వర్యంలో సానిటేషన్‌కు సంబంధించిన రక్షణ చర్యల గురించి అవగాహన కల్పించారు. అనంతరం కార్పొరేషన్ కమీషనర్ పి.సరస్వతి పారిశుధ్య కార్మికులకు ఆరోగ్యపరమైన రక్షణ కిట్లు, సేఫ్టీ ఎక్యుమెన్స్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అసిస్టెంట్ మున్సిపల్ కమీషనర్ శ్యామ్‌సుందర్, ఇఇ డి.మౌనిక, డిఇఇ వెంకన్న, మేనేజర్ బొమ్మ నాగేశ్వర్‌రావు, సానిటేషన్ ఇన్స్‌పెక్టర్ వంకాయల యాదగిరిలతో పాటు హన్మంతు, సిహెచ్ భాగ్యలత, వార్డు అధికారులు, సానిటేషన్ జవాన్లు, కామాటిలు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం లైన్స్‌క్లబ్



నిత్యవసర సరుకులు అందజేస్తున్న మాధవి సూర్యదేవర, విజయలక్ష్మీ, ఆశ

**ఎల్‌బినగర్, మే 27 ప్రభాతవార్త:** ఆపదలో ఉన్నవారికి ఆపన్న హస్తం అందించడంలో లైన్స్‌క్లబ్ ముందు వరసలో ఉంటుందని లైన్స్‌క్లబ్ ప్రతినిధులు మాధవి సూర్యదేవర, టి.విజయలక్ష్మి, నిమ్మగడ్డ ఆశ పేర్కొన్నారు. నాగోల్ డివిజన్ సాయినగర్ కాలనీలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా సిలిండర్ పేలి పెద్దఎత్తున గుడిసెలు గుడిసెలు అగ్నికి ఆహుతి కావడంతో లైన్స్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ జూబ్లీహిల్స్ తరఫున జిల్లా చైర్మన్ డాక్టర్ బి.విజయరంగ నేతృత్వంలో బాధిత కుటుంబాలకు నిత్యవసర సరుకులు దుస్తులను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపదలో ఉన్నవారికి తాము అండగా నిలుస్తామన్నారు. సుమారు 44 బాధిత కుటుంబాలకు అవసరమైన బిస్కెట్లు, మంచినూనె, పప్పు, బియ్యం, చీరలు, ఇతర దుస్తులను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి హయత్ నగర్ ఉప కమిషనర్ తిప్పర్తి యాదయ్య, డిఈ నీలిమ తదితరులు హాజరయ్యారు.

## అమావాస్య అన్నప్రసాద వితరణ



భోజనం వడ్డిస్తున్న ఉప్పల శ్రీనివాస్ గుప్తా

**ఎల్‌బినగర్, మే 27 ప్రభాతవార్త:** ఐవిఎఫ్ మహిళ విభాగ్ ఆధ్వర్యంలో కొత్తపేట మోహన్ నగర్ విద్యుత్ కార్యాలయం వద్ద మంగళవారం అమావాస్య సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో కన్వీనర్, టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మెన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త ప్రజలకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాలకన్న అన్నప్రసాద వితరణ కార్యక్రమం గొప్పదని అన్నారు. ఆకలి తీర్చడంలో వచ్చే ఆనందం వేరు అని ప్రతి అమావాస్య సందర్భంగా అన్న ప్రసాద వితరణ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఐవిఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న, మహిళ అధ్యక్షురాలు మంజుల, నళిని, మనిమాల, పోల అర్చన, లలిత, సరిత, పద్మజ, సరిత, దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

### చంపాపేటలో ఉచిత వైద్య శిబిరం..అన్నదానం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత

**సైదాబాద్, మే 27 ప్రభాతవార్త:** శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నదాన ట్రస్టు ఫౌండర్ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి ఆధ్వర్యంలో చంపాపేటలోని నల్ల పోచమ్మ ఎర్ర పోచమ్మ దేవాలయం సమీపంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం, అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా హాజరైన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, 18 చుక్కల ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ డాక్టర్ చుక్కల వేణు కుమార్ లు మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరాలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నదాన ట్రస్టు ఆధ్వర్యంలో ప్రతి నెల అన్నదానంనిర్వహించడం అభినందనీయమని, ట్రస్టు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేయాలని సూచించారు. శ్రీ మాత అన్నపూర్ణేశ్వరి అన్నదాన ట్రస్టు ఫౌండర్ చైర్మన్ దండేటి కార్ భగవత్ జి మాట్లాడుతూ గత 25 నెలలుగా ప్రతి అమావాస్యనాడు అన్నదానం నిర్వహిస్తున్నామని అన్నారు. మత్రి అరుంధతి ఆధ్వర్యంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్‌బినగర్ బిఆర్ఎస్ యూత్ వింగ్ అధ్యక్షుడు రవి ముదిరాజ్, ఉప్పల సంతోష్ సుశీల్ కుమార్, దాసరి కృష్ణారెడ్డి, టింగ్లికార్ రాజేష్, రాజు, తిలక్‌రాజ్, శివ, వెంకటేష్, ఉపేంద్రచారి, శ్రీనివాస్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

### మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి

**సైదాబాద్, మే 27 ప్రభాతవార్త:** సైదాబాద్ డివిజన్‌లో మౌళిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యతను ఇస్తున్నామని కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. ఏపిఏయు కాలనీలో రూ.16లక్షలతో చేపట్టనున్న సిసి రోడ్డు పనులను, జయానగర్‌లో చేపడుతున్న సిసి రోడ్డు పనులను మంగళవారం ప్రారంభించిన అనంతరం కార్పొరేటర్ అరుణ మాట్లాడుతూ కాలనీ సంక్షేమ సంఘాలు డివిజన్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపిఏయు కాలనీ అధ్యక్షుడు మడిగల విజయ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి వెంకటొరెడ్డి, కోశాధికారి శ్యాంప్రసాద్ పాల్గొన్నారు.

### ఆటోను దొంగలించిన పాత నేరస్థుడి అరెస్ట్

**మలక్ పేట ,మే 27 , ప్రభాతవార్త:** ఆటోను దొంగలించిన పాత నేరస్థుడిని అరెస్ట్ చేసిన సంఘటన చాదర్ ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం మిధాని డిపో హట్స్ లో నివసిస్తున్న పాత నేరస్థుడు నేనావత్ రవీందర్(31) చాదర్ ఘాట్ సూపర్ గ్యాస్ వద్ద అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో చాదర్ ఘాట్ పోలీసులు గమనించి ఆదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో మలక్ పేట పల్టాన్ వద్ద ఆటోను దొంగిలించడం జరిగిందని నిందితుడు అంగీకరించాడు. దీంతో పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించి ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇన్ స్పెక్టర్ బ్రహ్మ మురారి ఆధ్వర్యంలో ఎస్ ఐ తిరుపతి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి సహకారం

### - మంత్రి శ్రీధర్‌బాబు



ప్రెస్ క్లబ్ నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని మంత్రి శ్రీధర్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**ఉప్పల్, మే 27 ప్రభాతవార్త :** ఉప్పల్ ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తానని రాష్ట్ర ఐటిశాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, టియుడబ్ల్యూజె మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి. బాలరాజు, ప్రధాన కార్యదర్శి డి.వెంకట్రామ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ ఉప్పల్‌లో జర్నలిస్టుల సమస్యల పరిష్కరించాలని, ప్రెస్ క్లబ్ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విన్నవించారు. జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా నిలిచే జర్నలిస్టులకు తగిన సహకారం అందిస్తామన్నారు. ప్రెస్ క్లబ్ భవనం నిర్మించి తీరుతామన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, నరోత్తమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### చిలుకానగర్‌లో అదనపు తరగతి గదుల నిర్మాణం : ఎమ్మెల్యే



చిలుకానగర్‌లో అదనపు తరగతి గదులు నిర్మించాలని విద్యాశాఖ సెక్రటరీ యోగితారాణాకు విన్నవిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బన్నాల ప్రవీణ్ తదితరులు

**ఉప్పల్, మే 27 ప్రభాతవార్త :** చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణం కోసం తగు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ యోగితారాణాను మంగళవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నేత బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ చిలుకానగర్ ప్రభుత్వ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం రూ.236 లక్షల నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. దీనిపై సెక్రటరీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.త్వరలోనే పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులు చేపట్టాలని కార్పొరేటర్ ఇంటి ముందు ధర్నా



డ్రైనేజీ పనులు చేపట్టాలని కార్పొరేటర్ ఇంటి ముందు ధర్నా నిర్వహిస్తున్న బాలకృష్ణనగర్ వాసులు

**రామంతాపూర్, మే 27 ప్రభాతవార్త :** రామంతాపూర్ బాలకృష్ణనగర్ కాలనీలో డ్రైనేజీ పనులు చేపట్టాలని కోరుతూ పలువురు కాలనీవాసులు మంగళవారం రామంతాపూర్ కార్పొరేటర్ ఇంటి ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో బాలకృష్ణనగర్ కాలనీ అధ్యక్షుడు కె.స్వామి, ఎం.డి.జహంగీర్, ఇలిటం నరసింహారెడ్డి, పి.మహేశ్వర్‌రెడ్డి, రాంచందర్, ఖాసీం, నగేష్, రమేష్, శేఖర్ తదితరులు మాట్లాడుతూ బాలకృష్ణనగర్ కాలనీలో డ్రైనేజీ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కాలనీలో డ్రైనేజీ పనులు అడ్డుకుంటున్నారని వారు ఆరోపించారు. దీనిపై కార్పొరేటర్ బండారు శ్రీవాణి స్పందిస్తూ డ్రైనేజీ పనులు ఎవరు అడ్డుకోలేదని, దశలవారిగా పనులు చేపడుతున్నామన్నారు. ప్రధాన పైప్‌లైన్లు వేసిన తర్వాత గల్లీ రోడ్లు కూడా వేస్తామని తెలిపారు. కావాలనే కొందరు దీనిని రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని అదుపు చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పారిశుధ్య సిబ్బందిపై దాడి చేసిన వ్యక్తులపై కేసు



రామంతాపూర్‌లో ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులకు మద్దతు తెలుపుతున్న ఎర్రం శ్రీనివాస్ తదితరులు

**ఉప్పల్, మే 27 ప్రభాతవార్త :**
రోడ్డుపై చెత్త వేయవద్దని చెప్పిన పారిశుధ్య సిబ్బందిపై దాడికి పాల్పడిన వ్యక్తులకు ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్ రాంరెడ్డి నగర్‌లో మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఉప్పల్ పారిశుధ్య విభాగం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్, సిబ్బంది కలిసి పరిసరాలను శుభ్రం చేసి వెళ్లారు. అప్పుడు అదే ప్రాంతంలో నివసించే మణెమ్మ అనే మహిళ చెత్త తీసుకుని వచ్చి రోడ్డుపై వేయడంతో సిబ్బంది వారించారు. చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరించడంతో ఆమె వారిపై దాడికి పాల్పడినట్లు తెలిపారు. అడ్డుకోబోయిన పారిశుధ్య విభాగం ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్‌పై మణెమ్మ, ఆమె భర్త యాదగిరి, రాము అనే వ్యక్తులు దాడి చేసినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు పారిశుధ్య సిబ్బంది లక్ష్మి, జానకి, దేవి, సుజాత, జంగమ్మ, అశోక్ నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కాగా సిబ్బందిపై దాడి చేయడాన్ని ప్రజావాణి సంస్థ అధ్యక్షుడు ఎర్రం శ్రీనివాస్, సిపిఎం నేత వెంకన్న తీవ్రంగా ఖండించారు.